ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

**పాత్రికేయులు కావలెను**

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న ప్రజా రిపబ్లిక్ తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -130 | పేజీలు - 8 వెల - 03/- | గురువారం 27 ఆగస్టు 2026

# జాతీయరహదారిపై మృత్యుమృదంగం

**ఆరుగురి దుర్మరణం**

**కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఆగి ఉన్న కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు..**

**ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు**

**మరో 20 మందికి తీవ్ర గాయాలు..**

**కొందరి పరిస్థితి విషమం**

**హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తుండగా ఘటన**




**సూర్యాపేట,ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. **మిగతా 2లో...**



# నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు

**105 మంది భారతీయులు సహా 384 మంది పర్యాటకులు గల్లంతు**

**సహాయక చర్యలు ముమ్మరం**

**నేపాల్ ప్రధానితో ఫోన్ లో మాట్లాడిన మోదీ, సాయానికి సిద్ధమని ప్రకటన**



**ఢిల్లీ ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రసువా ప్రాంతంలోని భోటే కోశీ నదిలో బుధవారం ఆకస్మికంగా సంభవించిన వరదల కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 100 మందికి పైగా భారతీయులతో సహా వందలాది మంది పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ విపత్కర పరిస్థితుల్లో **మిగతా 2లో...**



# మత్స్యకారులు క్షేమం

**గల్లంతైన మత్స్యకారులు సురక్షితం: మంత్రి అచ్చెన్నాయుడు**


**బంగాళాఖాతంలో గల్లంతైన ఏపీ మత్స్యకారుల ఆచూకీ లభ్యం**

**పశ్చిమ బెంగాల్ తీరంలో సురక్షితంగా ఉన్న ఏడుగురు జాలర్లు**

**బోటులో సాంకేతిక లోపంతో తీరానికి కొట్టుకుపోయిన వైనం**

**వారిని స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ప్రభుత్వ ఏర్పాట్లు**

**అమరావతి, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** బంగాళాఖాతంలో ఈ నెల ప్రారంభంలో గల్లంతైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యమైందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ప్రకటించారు. వారంతా సురక్షితంగా ఉన్నారని, దీంతో వారి కుటుంబసభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. **మిగతా 2లో...**



# ‘భారత్ ధర్మశాల కాదు’

**: 2047కు అమిత్ షా భారీ భద్రతా బ్లూప్రింట్**

**2047 అభివృద్ధి లక్ష్యానికి అంతర్గత భద్రత కీలకమని అమిత్ షా వ్యాఖ్య**

**చొరబాట్లు, ఉగ్రవాదం, డ్రగ్స్‌పై ముందస్తు చర్యలకు పిలుపు**

**అక్రమ చొరబాట్ల నుంచి దేశాన్ని విముక్తం చేయడమే లక్ష్యమని వెల్లడి**

**‘భారత్ ధర్మశాల కాదు’ అంటూ అక్రమ వలసదారులపై తీవ్ర వ్యాఖ్యలు**

**కొత్త క్రిమినల్ చట్టాల పూర్తి అమలుకు ఏడాది గడువు లక్ష్యం**

**ఢిల్లీ ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యానికి పటిష్ఠ అంతర్గత భద్రతే పునాది అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, భవిష్యత్ భద్రతా సవాళ్లపై ఇప్పటి నుంచే ముందస్తు వ్యూహాలతో పనిచేయాలని పిలుపునిచ్చారు. **మిగతా 2లో...**

# నేతన్నలకు పాతిక వేలు..

**నేతన్నలకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి సవిత**

**‘నేతన్న సేవ‘ పథకంలో కొత్త దరఖాస్తుదారులకు ఈ నెలాఖరులోగా ఆర్థిక సాయం**

**అమరావతి, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అండగా నిలుస్తుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి వి. సవిత స్పష్టం చేశారు. ‘నేతన్న సేవ‘ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో ఈ నెలాఖరులోగా రూ. 25,000 జమ చేస్తామని ఆమె శుభవార్త తెలిపారు. పెనుకొండలో మంత్రి మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. **మిగతా 2లో...**



# అంతా మాఫియా రాజ్యం

**భయంకర కరవు పరిస్థితులు ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించడం లేదు: జగన్**

**డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని సవాల్ విసిరినా సమాధానం లేదన్న జగన్**

**చంద్రబాబు మాటలు నమ్మి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన**

**అమరావతి, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు. **మిగతా 2లో...**



# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

**భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ**

**మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు**

**సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి**



# జనవరి 1 నుంచి ‘సంజీవని’

**కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ**

**ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం**

**వైద్యారోగ్యం, సంజీవనిపై సమీక్షలో చంద్రబాబు**



**అమరావతి, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన ‘సంజీవని ప్రాజెక్టు’ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా ‘సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం ‘సంజీవని**మిగతా 2లో...**



# ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా సంస్థ ‘40 అండర్ 40‘ అవార్డుల కార్యక్రమం

**ముఖ్య అతిథిగా హాజరైన నారా లోకేశ్**

**ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు లోకేశ్ జవాబులు**

**కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నారా బ్రహ్మణి**




**అమరావతి, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** వ్యాపారమైనా, రాజకీయమైనా తాను నిర్వహించే సంస్థలకు, శాఖలకు కేవలం సంరక్షకుడిని (కస్టోడియన్) మాత్రమేనని, తనకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే**మిగతా 2లో...**

# జనవరి 1 నుంచి 'సంజీవని'

**మొదటిపేజీ తరువాయి**

ప్రాజెక్ట్'పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు... డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్ధవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చెప్పారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతీయరహదారిపై మృత్యుమృదంగం

**మొదటిపేజీ తరువాయి**

ప్రమాద సమయంలో బస్సులో 42 మంది ప్రయాణికులు ఉన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మృతి చెందిన వారు ఎన్టీఆర్ జిల్లా తేలప్రోలుకు చెందిన యాసారపు చిన్ని (32), విజయవాడకు చెందిన మేరీ జ్యోత్స్న (29), నాగేంద్రబాబు (21), సురవరపు షకీనా, భావన, లక్ష్మిగా గుర్తించారు. ఐరన్ సామగ్రితో రహదారిపై ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో.. ఐరన్ షీట్స్ బస్సులోకి చొచ్చుకెళ్లాయి. దీంతో నిద్రమత్తులో ఉన్న ప్రయాణికుల తలలో గుచ్చుకోవడంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటన తర్వాత బస్సు డ్రైవర్ మల్లికార్జున అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం 9గంటలకు ఏలూరు చేరుకోవాల్సిన బస్సు తెల్లవారుజామున 4 గంటల సమయంలో ప్రమాదానికి గురైంది. ఆరుగురి మృతదేహాలు ప్రస్తుతం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట కలెక్టర్, జిల్లా ఎస్పీ కోదాడ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారు. కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఎస్‌ను ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మరణించడం పట్ల క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యతగా బస్సుల యాజమాన్యం వ్యవహరించాలని సూచించారు.

### బస్సు ప్రమాద ఘటనపై మంత్రుల దిగ్భ్రాంతి

**అధికారులతో ఆరా తీసిన పవన్ కళ్యాణ్**
**క్షతగాత్రకుల మెరుగైన వైద్యం అందించాలన్న లోకేశ్**
**భద్రతా ప్రమాణాలపై మంత్రి మండిపల్లి సమీక్ష**

సూర్యాపేట జిల్లాలోని కోదాడ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలను అధికారుల ద్వారా పవన్ తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర అధికారులతో ఏపీ యంత్రాంగం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు పవన్ కల్యాణ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యంగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని ఆయన సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచించారు. ఈ బస్సు ప్రమాదంపై ఏలూరు జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. డీసీఎం కంటైనర్‌ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొనడంతో ఆరుగురు మృతిచెందిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నుంచి ఏలూరు వస్తుండగా ఈ బస్సు ప్రమాదానికి గురైంది. సూర్యాపేట పోలీసులతో ఏలూరు పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారు. మృతులు, క్షతగాత్రులు వివరాల కోసం అధికారులు ఆరా తీస్తున్నారు.

## మత్స్యకారులు క్షేమం

**మొదటిపేజీ తరువాయి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఓడలరేవుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఆగస్టు 3న సముద్రంలోకి వేటకు వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం వారు ఆగస్టు 12 నాటికి తిరిగి తీరానికి చేరుకోవాల్సి ఉంది. అయితే, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి రావడంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభమయ్యాయి.మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించిన వివరాల ప్రకారం, మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటులో సాంకేతిక లోపం తలెత్తడంతో అది పశ్చిమ బెంగాల్ తీరానికి కొట్టుకుపోయింది. అక్కడి అధికారుల ద్వారా సమాచారం అందుకున్న ఏపీ అధికారులు, బోటు యజమాని సోదరుడైన భవానీ ప్రసాద్‌తో మాట్లాడి మత్స్యకారులంతా క్షేమంగా ఉన్నట్లు ధ్రువీకరించుకున్నారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, అధికారుల బృందాన్ని వెంటనే పశ్చిమ బెంగాల్‌కు పంపాలని మంత్రి ఆదేశించారు.మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ (×జ+), నౌకాదళం, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ గాలింపు జరిపారు. మంగళవారం నాడు ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసి, 15 కోస్ట్ గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను రంగంలోకి దించారు. కోల్‌కతాలోని ఈస్టర్న్, నార్త్-ఈస్టర్న్ కమాండ్‌లను అప్రమత్తం చేయడంతో పాటు, మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (వీ=జజ) పర్యవేక్షణలో ఎలక్ట్రానిక్ నిఘా కూడా కొనసాగించారు. అవసరమైతే సమాచారం లభించవచ్చనే ఉద్దేశంతో పొరుగు దేశాలైన మయన్మార్, బంగ్లాదేశ్ సముద్రయాన అధికారులను కూడా అప్రమత్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం సమష్టి కృషితోనే మత్స్యకారుల ఆచూకీని కనిపెట్టగలిగామని, ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్న జిల్లా కలెక్టర్, కమిషనర్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, కోస్ట్ గార్డ్ సిబ్బందిని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు.

# ఉత్కంఠ రేపుతున్న కాంగ్రెస్ రాజకీయాలు

**భట్టితో కొండా మురళి, రాజగోపాల్ భేటీ**

**మామూలుగానే కలిశామని వ్యాఖ్యలు**

**సుష్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదన్న కొండా మురళి**



**హైదరాబాద్, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**

కాంగ్రెస్‌లో రాజకీయాలు ఉత్కంఠ రేపుతున్నాయి. క్రమశిక్షణ కమిటీ నివేదిక అందిన తరవాత కొండామురళి రంగంలోకి దిగారు. నేరుగా ఆయన డిప్యూటి సిఎం భట్టిని కలిశారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ చేయలేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. అయితే, సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగతమని కొండా సురేఖ స్పష్టం చేశారు. తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇప్పుడే వీరంతా ఎందుకు భేటీ అయ్యారన్నది చర్చ జరుగుతోంది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ఎ÷-లాన్-ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ఎ÷-లాన్-బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను' అని కొండా మురళి వ్యాఖ్యానించారు. సుస్మితకు స్వతంత్రంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని తెలిపారు. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదన్నారు. సుస్మిత తనకు నచ్చినట్లు తాను ఉంటుందని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని కొండా మురళి పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని అన్నారు. 'మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?' అని వ్యాఖ్యానించారు. కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానని కొండా మురళి స్పష్టం చేశారు. ఉత్తమ్ కూడా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా వెళ్లిపోయారు. తాను సిఎంకు, పార్టీకి వ్యతిరేకంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే వరంగల్ జిల్లా పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె విమర్శించారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని ప్రశ్నిస్తూ.. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్రంగా పోటీ చేస్తానని ప్రకటించారు. సుస్మిత వ్యాఖ్యలపై తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆమెపై చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది.

# అంతా మాఫియా రాజ్యం

**మొదటిపేజీ తరువాయి**

తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ... పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు వర్షాలు లేక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే, నీటి విడుదల విషయంలో చంద్రబాబు ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించాల్సింది పోయి... తెలంగాణతో పోటీపడి విద్యుత్ ఉత్పత్తి కోసమే వినియోగించడం దారుణమన్నారు. అవకాశమున్నా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పలేదని విమర్శించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాయలసీమకు నీరు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశారు.

## నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు

**మొదటిపేజీ తరువాయి**

నేపాల్‌కు అండగా నిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు.బుధవారం నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. "ఈ కష్టకాలంలో నేపాల్ సోదర సోదరీమణులకు భారత ప్రజలు తోడుగా ఉంటారు. సహాయక చర్యల కోసం మన బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.నేపాల్ టూరిజం బోర్డు (ఎన్టీబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, ఈ వరదల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వీరిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, మిగిలిన వారు విదేశీయులు ఉన్నారు. గల్లంతైన విదేశీయులలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సంఖ్య ప్రాథమికమైనదేనని, ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక అధికారులతో కలిసి వివరాలను ధ్రువీకరిస్తున్నామని ఎన్టీబీ స్పష్టం చేసింది. గల్లంతైన వారు తొమ్మిది వేర్వేరు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నేపాల్ పర్యటనకు వచ్చారని ప్రాథమిక సమాచారం.కాఠ్మండు టైమ్స్ కథనం ప్రకారం, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సమాచారం లేదా సహాయం కోసం పర్యాటకులు, వారి కుటుంబ సభ్యుల కోసం నేపాల్ టూరిజం బోర్డు పలు ఎమర్జెన్సీ నంబర్లను (1234, 1144, 9851289445) జారీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటకులు ఆందోళన చెందవద్దని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

# నేతన్నలకు పాతిక వేలు..

**మొదటిపేజీ తరువాయి**

తొలి విడతలో భాగంగా ఇప్పటికే 71,536 మంది నేతన్నలకు రూ.166 కోట్ల ఆర్థిక సాయం అందించామని మంత్రి గుర్తుచేశారు. తాజాగా మరో 36,617 మంది ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటి పరిశీలన ప్రక్రియ వేగంగా జరుగుతోందని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి అర్హుల జాబితాను ఖరారు చేసి, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 25,000 జమ చేస్తామని హామీ ఇచ్చారు. నేతన్న సేవ పథకంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆమె విమర్శించారు.వ్యవసాయం తర్వాత రాష్ట్రంలో అత్యధిక జనాభా ఆధారపడిన చేనేత రంగానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి సవిత అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేనేత కార్మికులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. 2014-19 మధ్య చంద్రబాబు పాలన చేనేత కార్మికులకు స్వర్ణయుగమని, నేతన్నల కష్టాలు తెలిసిన వ్యక్తిగా చంద్రబాబు 50 ఏళ్లకే పెన్షన్ పథకాన్ని అమలు చేశారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ మాట నిలబెట్టుకుంటూ, 86,000 మంది నేతన్నలకు 50 ఏళ్లకే నెలకు రూ. 4,000 చొప్పున పెన్షన్ అందిస్తోందని వివరించారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు, చెప్పని పథకాలను కూడా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా 52,952 మంది చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. మగ్గాలకు (హ్యాండ్లూమ్స్) 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ నేతన్నల పక్షపాతి అని, వారి అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటుందని మంత్రి సవిత భరోసా ఇచ్చారు.

# 'భారత్ ధర్మశాల కాదు'

**మొదటిపేజీ తరువాయి**

ఢిల్లీలో జరిగిన ఇంటెలిజెన్స్ బ్యూరో 'జాతీయ భద్రతా సదస్సు' ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు.మరో 15 నుంచి 20 ఏళ్లలో ఎదురయ్యే భద్రతా సవాళ్లను ఇప్పటి నుంచే గుర్తించాలని అమిత్ షా సూచించారు. అవి పెద్ద సంక్షోభాలుగా మారకముందే తిప్పికొట్టే వ్యూహాలు సిద్ధం చేయాలని చెప్పారు. దేశంలో మూడు ప్రధాన అంతర్గత భద్రతా హాట్‌స్పాట్ల నుంచి ఎదురైన ముప్పులను సమర్థంగా అధిగమించామని పేర్కొన్నారు.సరిహద్దు భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టిందని షా తెలిపారు. ఎనిమిది నెలలుగా అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని చెప్పారు. నాలుగు అంచెల సరిహద్దు భద్రతా ప్రణాళికను రాష్ట్రాలకు అందించామని వెల్లడించారు."ఇది ధర్మశాల కాదు. ఈ దేశ పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంది" అని షా వ్యాఖ్యానించారు. అక్రమ చొరబాటుదారులు జాతీయ భద్రత, ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు ముప్పని హెచ్చరించారు.కొత్తగా తెచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను వచ్చే ఏడాదిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షా చెప్పారు. క్రిమినల్ కేసులు సుప్రీంకోర్టు స్థాయి వరకు మూడేళ్లలో పరిష్కారమయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షల శాతాన్ని 25 శాతం పెంచడమూ లక్ష్యమేనన్నారు.పీఎఫ్ఐపై నిషేధం తర్వాత చేపట్టిన చర్యలను కేంద్ర-రాష్ట్ర సమన్వయానికి ఉదాహరణగా షా పేర్కొన్నారు. ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగా ధ్వంసం చేసేందుకు 'ప్రహార్' వ్యూహాన్ని రోజువారీ భద్రతా కార్యకలాపాల్లో అమలు చేయాలని సూచించారు.మాదకద్రవ్యాలపై 'డిటెక్ట్, డిస్‌రప్ట్, డిస్ట్రాయ్' విధానాన్ని అనుసరించాలని రాష్ట్రాలకు పిలుపునిచ్చారు. 2026-29 మాదకద్రవ్య నియంత్రణ విజన్ డాక్యుమెంట్‌ను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్, ఐసీజేఎస్, నాట్‌గ్రిడ్, నాఫిస్ డేటాబేస్‌ల అనుసంధానంతో శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఏర్పడిందని షా తెలిపారు. కృత్రిమ మేధ, డేటా విశ్లేషణ, ప్రవర్తనా సరళి అధ్యయనం ద్వారా భవిష్యత్ ముప్పులను ముందే గుర్తించాలని యువ అధికారులకు సూచించారు.

## ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' అవార్డుల కార్యక్రమం

**మొదటిపేజీ తరువాయి**

తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలో స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే మూడు సూత్రాలే తమ విజయ రహస్యాలని ఆయన వెల్లడించారు. దేశంలోని యువ వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులకు ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' పేరుతో ముంబైలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.
ఈ వేడుకలో భాగంగా, డైరీ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో హెరిటేజ్ సంస్థ సాధించిన ప్రగతికి గాను, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డును ప్రదానం చేశారు.
అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. "ప్రభుత్వ నిర్వహణలో మీరు క్రమశిక్షణ పాటిస్తున్నారు. పొదుపు గురించి మాట్లాడారు. ఈ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది?" అని గోయెంకా ప్రశ్నించగా, లోకేశ్ బదులిచ్చారు. "వ్యాపారంలో అయినా, రాజకీయాల్లో అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేనని నేను బలంగా నమ్ముతాను. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. గతంలో వ్యాపారంలో, ఇప్పుడు ప్రభుత్వ బాధ్యతల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను" అని వివరించారు.

ప్రజా రిపబ్లిక్



# నేరగాళ్ల పంజా

**వేదికగా .. సోషల్ ప్లాట్‌ఫామ్‌లు**
**వ్యక్తిగత ఖాతాలకు గోప్యత కరువు**
**బహిరంగంగా మొబైల్ నంబర్లు.. నేరగాళ్లకు వరం**
**సామాన్యులు సైతం సైబర్ నేరగాళ్ల వలలోనే**
**డిజిటల్ భద్రతపై మరింత అప్రమత్తత అవసరం**



**రిపబ్లిక్ ప్రత్యేక కథనం అమరావతి**
డిజిటల్ లావాదేవీలు విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరగాళ్ల పంజా పుంజుకుంటోంది. ఒకప్పుడు బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు, ఓటీపీ వంటి సమాచారానికే పరిమితమైన మోసాలు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే స్థాయికి చేరాయి. ముఖ్యంగా సోషల్ మీడియా ఖాతాలు, చిన్న వ్యాపారాల ప్రచార పేజీలు, వ్యక్తిగత ప్రొఫైళ్లలో మొబైల్ నంబర్లు, ఇతర సంప్రదింపు వివరాలను బహిరంగంగా ఉంచడం నేరగాళ్లకు అనుకూలంగా మారుతోంది.

**ఎక్కువగా ఆర్థిక లావాదేవీలకు పాల్పడుతున్న ఘటనలే**
ఒకసారి మొబైల్ నంబర్ సోషల్ మీడియా వేదికల్లోకి చేరితే దాని ఆధారంగా వ్యక్తి పేరు, వ్యాపారం, ప్రాంతం, ఇతర అందుబాటులో ఉన్న వివరాలను సేకరించే అవకాశం ఉంటుంది. అనంతరం మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు, నకిలీ లింకులు, ఫేక్ యాప్‌ల ద్వారా లక్ష్యంగా చేసుకుంటున్నారు. బ్యాంకు అధికారులు, కొరియర్ సంస్థలు, టెలికం కంపెనీలు, ప్రభుత్వ విభాగాల పేర్లు చెప్పి నమ్మించి ఆర్థిక లావాదేవీలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి.ప్రస్తుతం మొబైల్ నంబర్ కేవలం ఫోన్ చేసుకునేందుకు మాత్రమే ఉపయోగపడటం లేదు. బ్యాంకు ఖాతాలు, యూపీఐ చెల్లింపులు, సోషల్ మీడియా ఖాతాలు, వివిధ డిజిటల్ సేవలకు అది అనుసంధానమై ఉంది. దీంతో మొబైల్ నంబర్ గోప్యతకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. నంబర్ బహిరంగమైతే దాని ఆధారంగా ఇతర సమాచారాన్ని అనుసంధానించే అవకాశం ఉండటంతో సైబర్ నేరగాళ్లకు ఇది కీలక ఆధారంగా మారుతోంది.

**నంబర్‌కు బదులుగా యూజర్ నేమ్ ఐడి గోప్యత**
వినియోగదారుల సమాచార భద్రతకు ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో యూపీఐ వ్యవస్థల్లో మొబైల్ నంబర్లు, యూపీఐ ఐడీలు, ఖాతా వివరాలను మాస్క్ చేసే విధానాలపై దృష్టి పెరుగుతోంది. లావాదేవీల సమయంలో పూర్తి మొబైల్ నంబర్ కనిపించకుండా కొంత భాగాన్ని మాత్రమే చూపించడం, మొబైల్ నంబర్‌కు బదులుగా యూజర్ నేమ్ ఆధారిత ఐడీలను ప్రోత్సహించడం వంటి చర్యలు గోప్యతను పెంచే అవకాశం ఉంది.బ్యాంకు ఖాతాకు మొబైల్ నంబర్ అనుసంధానం అవసరమైనప్పటికీ అదే నంబర్‌ను సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికల్లో పూర్తిగా బహిర్గతం చేయాల్సిన అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వ్యక్తిగత నంబర్‌లో కొంత భాగాన్ని మాత్రమే చూపించి మిగిలిన అంకెలను చుక్కల రూపంలో ఉంచే విధానాన్ని విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో భద్రతా ధ్రువీకరణ అనంతరం మాత్రమే పూర్తి వివరాలు అందుబాటులోకి వచ్చేలా సాంకేతిక వ్యవస్థలను రూపొందిస్తే మోసాల ముప్పును కొంతమేర తగ్గించవచ్చు.

**నకిలీ నంబర్లతో ఆర్థిక సమాచారంతో భారీ దోపిడీలు**
సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. నకిలీ బ్యాంకు వెబ్‌సైట్లు, మోసపూరిత యాప్‌లు, ఫిషింగ్ లింకులు, నకిలీ కస్టమర్ కేర్ నంబర్లతో వ్యక్తిగత, సమాచారాన్ని సేకరించే ప్రయత్నాలు చేస్తూ ఆర్థికంగా దెబ్బతీస్తున్నారు.ఒకవైపు డిజిటల్ సేవల వినియోగం పెరుగుతుండగా మరోవైపు వ్యక్తిగత సమాచార రక్షణకు సరైన ప్రాధాన్యం ఇవ్వకపోతే మోసాలకు అవకాశం మరింత పెరిగే ప్రమాదం ఉంది.వ్యక్తిగత సమాచారాన్ని అవసరానికి మించి బహిర్గతం చేయకుండా వినియోగదారులు అప్రమత్తంగా ఉండటంతో పాటు ప్రభుత్వాలు, బ్యాంకులు, డిజిటల్ చెల్లింపు సంస్థలు, సోషల్ మీడియా వేదికలు కూడా మరింత పటిష్టమైన భద్రతా ప్రమాణాలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. అనుమానాస్పద మొబైల్ నంబర్లు, ఆర్థిక మోసాలపై పర్యవేక్షణ, సైబర్ ఫిర్యాదుల సమన్వయం వంటి చర్యలు కొనసాగుతున్నప్పటికీ నేరగాళ్ల కొత్త వ్యూహాలకు అనుగుణంగా భద్రతా వ్యవస్థలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలి.

**అపరిచితులకు బ్యాంకు వివరాలను వెల్లడించకూడదు**
సామాన్యులు సైతం సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా జాగ్రత్తలు పాటించాలి. అపరిచితులకు ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్, బ్యాంకు ఖాతా వివరాలను వెల్లడించకూడదు. అనుమానాస్పద లింకులను తెరవకూడదు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఖాతాలో అనధికార లావాదేవీ గుర్తించిన వెంటనే బ్యాంకుకు సమాచారం ఇవ్వడంతో పాటు అధికారిక సైబర్ నేర ఫిర్యాదు వ్యవస్థను ఆశ్రయించాలి.డిజిటల్ ప్రపంచంలో మొబైల్ నంబర్ ఒక కీలక గుర్తింపుగా మారిన నేపథ్యంలో దాని గోప్యతను కాపాడటం అత్యవసరం. డిజిటల్ సౌకర్యాలు విస్తరించడమే కాకుండా వ్యక్తిగత సమాచారానికి పటిష్టమైన రక్షణ కల్పించినప్పుడే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. సౌకర్యం ఎంత ముఖ్యమో.. గోప్యత, భద్రత కూడా అంతే ముఖ్యం.

# ఎలుగుబంటి దాడిలో రైతుకు తీవ్ర గాయాలు




**తోటకు వెళ్లిన రైతుపై దాడి.. ఆసుపత్రికి తరలింపు**
**ఎలుగుబంట్ల సంచారంతో రైతుల్లో భయాందోళన**
**అటవీ శాఖ చర్యలు చేపట్టాలని గ్రామస్థుల డిమాండ్**

**కళ్యాణదుర్గం/కుందుర్పి క్రైమ్, ఆగస్టు 26 (రిపబ్లిక్ న్యూస్):**
తెల్లవారుజామున పొలానికి వెళ్లిన ఓ రైతుపై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్ర గాయాలైన ఘటన కుందుర్పి మండలం తెనగల్లు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు వెంకటేశులు నిత్యకృత్యంలో భాగంగా తెల్లవారుజామున తన తోటకు వెళ్లగా అక్కడ సంచరిస్తున్న ఎలుగుబంటి ఒక్కసారిగా ఆయనపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. ఊహించని విధంగా జరిగిన ఈ ఘటనతో రైతు తీవ్రంగా గాయపడ్డారు.ఎలుగుబంటి దాడితో భయాందోళనకు గురైన వెంకటేశులు సహాయం కోసం కేకలు వేయడంతో సమీపంలో ఉన్న గ్రామస్థులు అప్రమత్తమయ్యారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని రక్షించే ప్రయత్నం చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న ఆయనను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందజేస్తున్నారు.

**వన్యప్రాణుల సంచారంతో ప్రజలు తీవ్ర ఆందోళన**
తెనగల్లు గ్రామ పరిసర ప్రాంతాల్లో కొంతకాలంగా ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అటవీ ప్రాంతాలకు సమీపంగా ఉన్న వ్యవసాయ భూములు, తోటల్లోకి ఎలుగుబంట్లు వస్తుండటంతో రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తెల్లవారుజామున వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో, అలాగే సాయంత్రం వేళల్లో ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా కనిపిస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.పంటల సాగు, తోటల


ఎలుగుబంట్ల దాడిలో గాయపడిన వ్యక్తికి చికిత్స అందజేస్తున్న వైద్యులు

సంరక్షణ కోసం రైతులు తప్పనిసరిగా పొలాలకు వెళ్లాల్సి ఉండటంతో వన్యప్రాణుల సంచారం వారికి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే ఎలుగుబంటి దాడిలో ఓ రైతు గాయపడటంతో గ్రామంలో భయాందోళన మరింత పెరిగింది. వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు సైతం ఒంటరిగా పొలాల్లోకి వెళ్లేందుకు వెనుకంజ వేస్తున్న పరిస్థితి నెలకొంది.

**ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి**
తెనగల్లు గ్రామ పరిసరాల్లో ఎలుగుబంట్ల సంచారాన్ని గుర్తించి వాటి కదలికలపై నిఘా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు అటవీ శాఖ అధికారులను కోరుతున్నారు. గ్రామానికి సమీపంలోని పొలాలు, తోటల్లో ఎలుగుబంట్లు సంచరించకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండేలా అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.
బాధిత రైతు వెంకటేశులు స్నేహితుడు మాట్లాడుతూ ఘటన గురించి తనకు ఫోన్ ద్వారా సమాచారం అందగానే వెంటనే అక్కడికి చేరుకున్నానని తెలిపారు. అప్పటికే వెంకటేశులు తీవ్ర గాయాలతో ఉన్నారని, గ్రామస్థుల సహకారంతో ఆయనను ఆసుపత్రికి


ఎలుగుబంట్ల దాడి సంఘటనను తెలియజేస్తున్న బాధితుని స్నేహితుడు

తరలించామని చెప్పారు. గ్రామ పరిసరాల్లో ఎలుగుబంట్ల సంచారం కొనసాగుతున్నందున అధికారులు ఇకనైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**వాటి సంచారాన్ని అరికట్టకపోతే భయం గుప్పిట్లో గ్రామాలు**
రైతులు, వ్యవసాయ కూలీలు ప్రతిరోజూ తెల్లవారుజామునే పొలాలకు వెళ్లాల్సి వస్తుండటంతో వన్యప్రాణుల నుంచి వారి భద్రతకు ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఎలుగుబంట్ల సంచారాన్ని అరికట్టడంతో పాటు వాటి కదలికలను పర్యవేక్షించి గ్రామాల వైపు రాకుండా అటవీ శాఖ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.ఒకవైపు పంటల పనులు, మరోవైపు ఎలుగుబంట్ల భయం దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తాజాగా జరిగిన దాడి ఘటనను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి గ్రామ పరిసర ప్రాంతాలను పరిశీలించి, రైతులు, కూలీలకు భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలని తెనగల్లు గ్రామస్థులు కోరుతున్నారు.

# రక్తదానం.. ప్రాణదానంతో సమానం

**మిలాద్ ఉన్ నభి సందర్భంగా రెడ్‌ప్లస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం**
**స్వచ్ఛందంగా రక్తదానం.. మతసామరస్యానికి ప్రతీకగా కార్యక్రమం**

**గుత్తి ఆగస్టు 26 (రిపబ్లిక్ న్యూస్)**
రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, హ్యాండ్స్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణస్వామి పిలుపునిచ్చారు. మిలాద్ ఉన్ నభి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద రెడ్‌ప్లస్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌ప్లస్ వ్యవస్థాపకుడు సయ్యద్ షేక్ షావలి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కులమతాలకు అతీతంగా యువతతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఎంతోమంది ప్రాణాలను



కాపాడవచ్చన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని కోరారు. మిలాద్ ఉన్ నబి సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.
డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ మాట్లాడుతూ అవసరమైన సమయంలో సకాలంలో రక్తం అందితే విలువైన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. యువతలో రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు రక్తదానం చేయడం మానవతా విలువలకు నిదర్శనమన్నారు.
హ్యాండ్స్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నారాయణస్వామి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఒక వ్యక్తి ఇచ్చిన రక్తం అవసరమైన సమయంలో మరొకరి ప్రాణాలను నిలబెట్టగలదని తెలిపారు. యువత సేవా కార్యక్రమాల్లో చురుగ్గా



పాల్గొనాలని, సమాజానికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.
రెడ్‌ప్లస్ వ్యవస్థాపకుడు సయ్యద్ షేక్ షావలి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ సేవాభావంతో రక్తదానం చేయాలని కోరారు. ఒక యూనిట్ రక్తం మరొకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉందన్నారు. రక్తదానంపై అపోహలు వీడి యువత పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మిలాద్ ఉన్ నభి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా మానవతా సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ ఉద్దేశమన్నారు.
ఈ కార్యక్రమంలో మాఫిర్, మున్నా, కాజా మైనుద్దీన్, నాగదని భారత్, హరి, హబీబ్, సులేమాన్, రాముస్వామి, అజామ్‌ఖాన్, యశ్వంత్, భార్గవ్‌సాయి, సమీర్, షాజాఫర్, తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

**ఐ ఎన్ టి యూ సి నూతన రాష్ట్ర సెక్రటరీలు**
**ఇద్దరికి రాష్ట్ర ఐ ఎన్ టి యూ సి లో కీలక బాధ్యతలు**


ప్రసాద్ రెడ్డి


దాదా పీర్

**అనంతపురం సంక్షేమం, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా తమ వంతు కృషి చేస్తామని ఐ ఎన్ టి యూ సి నూతనంగా కీలక బాధ్యతలు చేపట్టిన రాష్ట్ర సెక్రటరీలు ప్రసాద్ రెడ్డి, దాదా పీర్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఈ. ప్రసాద్‌రెడ్డి, ఎస్. దాదాపీర్‌లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐ ఎన్ టి యూ సి లో కీలక బాధ్యతలు దక్కాయి. వారిని ఐ ఎన్ టి యూ సి లో రాష్ట్ర సెక్రటరీలుగా నియమించారు. ఈ సందర్భంగా వారు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తమపై విశ్వాసంతో రాష్ట్రస్థాయి బాధ్యతలు అప్పగించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి, ఐ ఎన్ టి యూ సి రాష్ట్ర అధ్యక్షుడు పూల చంద్రశేఖర్, కనుముక్కల సానే ఉమా, పీసీసీ ఉపాధ్యక్షుడు కోట సత్యమయ్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ, ఐ ఎన్ టి యూ సి తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని ప్రసాద్‌రెడ్డి, దాదాపీర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఐ ఎన్ టి యూ సి ను బలోపేతం చేయడంతోపాటు కార్మికుల సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సంస్థ అభివృద్ధికి పార్టీ పెద్దలు, కార్మికులు, నాయకుల సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# మదర్ థెరిస్సా సేవలు ఆదర్శనీయం




**గుత్తి ఆగస్టు 26 (రిపబ్లిక్ న్యూస్ ):** పట్టణంలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లోని పెన్షనర్స్ భవనంలో మదర్ థెరిస్సా జయంతిని పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా మదర్ థెరిస్సా చిత్రపటానికి కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, కార్యదర్శి రామ్‌మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జెన్నే కుల్లాయిబాబు మాట్లాడుతూ మదర్ థెరిస్సా నిరుపేదలు, అనాథలు, రోగులు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచారని తెలిపారు. ఆకలితో బాధపడుతున్న వారికి ఆహారం, రోగులకు మందులు అందిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. మృత్యువు సమీపించిన వారికి ధైర్యం చెబుతూ మానవత్వాన్ని చాటారని అన్నారు. ఆమె జీవిత చరిత్రను తెలుసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరిలో సేవాభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. 'మానవ సేవే మాధవ సేవ' అనే భావనతో సాటి మనుషులకు సేవ చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాంబ, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, కార్యదర్శి రామ్‌మోహన్, వెంకటసుబ్బమ్మ, నారాయణరెడ్డి, గోవిందప్ప, నారాయణశెట్టి, మద్దులేటి, శామ్యూల్, హస్సన్ అహమ్మద్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలకు హాజరైన గంగుల ప్రభాకర్ రెడ్డి




**ఆళ్లగడ్డ ఆగస్టు 26 రిపబ్లిక్ న్యూస్**
వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూల్ జిల్లా పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి పలు వివాహ వేడుకలలో పాల్గొన్నారు చాగలమర్రి మండలం వెల్లాలగ్రామం లోని సీతారామ కళ్యాణ మండపం నందు చాగలమర్రి మండలం కలగొట్లపల్లి గ్రామ వాస్తవ్యులు ఈదుల రవి రెడ్డి కుమారుని వివాహ వేడుకలలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు, అనంతరం దొర్నిపాడు మండల కేంద్రం లోని వీర విజయ కల్యాణ మండపం నందు బుర్రారెడ్డి పల్లె గ్రామ వాస్తవ్యులు పెద్ద కోట్ల నాగేశ్వరావు కుమారుని వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. గంగుల ప్రభాకర్ రెడ్డి వెంట ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కులూరు నరసింహ రెడ్డి, దొర్నిపాడు వైసీపీ నాయకుడు నాగేశ్వరావు యాదవ్, చాగలమర్రి వైసీపీ నాయకుడు షేక్ బాబూలాల్, చాగలమర్రి మండలాధ్యక్షులు తోడేండ్ల పల్లి వీర భద్రుడు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ శ్రీ శ్రీ కాళికామాత ఆలయంలో దసరా శరణ్ణవరాత్రులపై సమావేశం

**ఆళ్లగడ్డ ఆగస్టు 26 రిపబ్లిక్ న్యూస్**
ఆళ్లగడ్డ పట్టణం లోని శ్రీ శ్రీ శ్రీ కాళికామాత దేవస్థానంలో శుక్రవారం 28-08-2026 వ తేదీన సాయంత్రం 6-30 గంటలకు కమిటీ అధ్యక్షులు, మరియు గౌరవాధ్యక్షులు,గౌరవ సలహాదారుల ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సమావేశం ఏర్పాటు చేయవలెనని నిర్ణయించడమైనదని ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యం దసరా శరన్నవరాత్రులు గురించి చర్చించి వాటికి సంబంధించిన సరైన సలహాలు సూచనలు ఇవ్వవలసిందిగా కమిటీ సభ్యులను కోరడమైనది. కావున ఈ సమావేశంలో ప్రతి ఒక్క కమిటీ సభ్యులు దేవస్థానం ఆవరణలో గల ఆఫీస్ రూమ్ నందు జరిగే మీటింగ్ లో తప్పకుండా పాల్గొని తమ అభిప్రాయాలు సలహాలు ఇచ్చి సమావేశం జయప్రదం చేయాలని కోరారు.



# పావని మృతి వెనుక అసలు కారణమేంటి?

**గర్భాశయంలో అవశేషాల తొలగింపు**

**చికిత్సలో 27 ఏళ్ల వివాహిత మృతి..**

**రెండు ఆస్పత్రుల పరస్పర విరుద్ధ వాదనలు**

**లింగ నిర్ధారణ ఆరోపణలపైనా అనుమానాలు..**

**రూ.6.50 లక్షల పరిహారంతో మరిన్ని ప్రశ్నలు**




**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ ఆగస్టు 26)**
గర్భాశయంలో మిగిలిన అవశేషాలను తొలగించేందుకు చికిత్స పొందుతున్న 27 ఏళ్ల వివాహిత పావని మృతి కర్నూలులో తీవ్ర చర్చకు దారితీసింది. దేవనగర్‌లోని మౌర్యా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందడం, అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించే సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా పావనికి గతంలో అబార్షన్ ఎక్కడ జరిగింది? గర్భాశయంలో అవశేషాలు ఎందుకు మిగిలాయి? ప్రస్తుత చికిత్సలో ఏం జరిగింది? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.
బంధువుల వివరాల ప్రకారం పందిపాడు గ్రామానికి చెందిన పావని గతంలో గర్భస్రావానికి సంబంధించిన చికిత్స పొందింది. అనంతరం గర్భాశయంలో కొన్ని అవశేషాలు మిగిలినట్లు వైద్యులు గుర్తించారని, భవిష్యత్తులో గర్భధారణ కోసం ఆమె చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మౌర్యా ఆస్పత్రిలో గర్భాశయంలోని అవశేషాలను తొలగించే ప్రక్రియ చేపట్టగా, చికిత్స సమయంలో రెండుసార్లు తీవ్ర గుండె సంబంధిత సమస్య తలెత్తిందని, వైద్యులు ప్రయత్నించినప్పటికీ ఆమె మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.
అయితే మృతి విషయం కుటుంబ సభ్యులకు వెంటనే తెలియజేయకుండా రాత్రి సమయంలో పోలీసుల ద్వారా సమాచారం అందించారని బంధువులు ఆరోపించారు. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చికిత్స చేసిన వైద్యురాలు అక్కడికి రావాలని బంధువులు పట్టుబట్టగా పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

### రెండు ఆస్పత్రుల వాదనలు.. ఏది నిజం?

ఈ ఘటనలో కీలకంగా మారిన అంశం రెండు ఆస్పత్రుల మధ్య వినిపిస్తున్న పరస్పర విరుద్ధ వాదనలు. పావనికి గతంలో రెండు ప్రసవాలు కర్నూలులోని జీఎన్‌ఆర్ ఆస్పత్రిలోనే జరిగాయని బంధువులు చెబుతున్నారు. అయితే జీఎన్‌ఆర్ ఆస్పత్రి వర్గాలు మాత్రం ప్రస్తుత సమస్యకు తమకు సంబంధం లేదని పేర్కొంటున్నాయి. వైద్యురాలు కళా సౌందర్య మౌర్యా ఆస్పత్రికి వెళ్లి కొంతసేపు ఉండి తిరిగి వచ్చారని, పూర్తి ప్రక్రియ తమ వద్ద జరగలేదని ఆస్పత్రి వర్గాలు వెల్లడించినట్లు సమాచారం.
మరోవైపు మౌర్యా ఆస్పత్రి యాజమాన్యం మాత్రం పావనికి గతంలోనే అబార్షన్ జరిగిందని, దాని అనంతరం కొన్ని అవశేషాలు గర్భాశయంలో మిగిలిపోవడంతో సమస్య ఏర్పడిందని చెబుతోంది. అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో జీఎన్‌ఆర్ ఆస్పత్రి నుంచి పావనిని మౌర్యా ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు ఆస్పత్రి వైద్యులు పేర్కొంటున్నారు.

### లింగ నిర్ధారణ ఆరోపణలపైనా దర్యాప్తు అవసరం

పావని గతంలో గర్భస్రావం చేయించుకోవడానికి గల కారణాలపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆడశిశువు కారణంగా అబార్షన్ జరిగిందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదు.
గర్భస్థ శిశువు లింగాన్ని గుర్తించి దాని ఆధారంగా అబార్షన్ జరిగిందా? గత వైద్య ప్రక్రియ ఏ ఆస్పత్రిలో జరిగింది? ఎవరు నిర్వహించారు? అనే అంశాలు వైద్య ఆరోగ్యశాఖ, పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఆరోపణలు నిజమని తేలితే అది తీవ్రమైన చట్టవిరుద్ధ చర్యగా పరిగణించబడే అవకాశం ఉంది.





### 10 లక్షల డిమాండ్.. రూ.6.50 లక్షలతో పరిష్కారం?

మృతదేహాన్ని అప్పగించే సమయంలో పావని కుటుంబ సభ్యులు రూ.10 లక్షల పరిహారం డిమాండ్ చేసినట్లు సమాచారం. అనంతరం ప్రైవేట్ ఆస్పత్రుల సంఘం ప్రతినిధుల సమక్షంలో చర్చలు జరిగి రూ.6.50 లక్షలు కుటుంబానికి అందించిన తర్వాత మృతదేహాన్ని అప్పగించినట్లు తెలిసింది.
అయితే వైద్యపరమైన తప్పిదం జరగలేదని చెబుతున్న ఆస్పత్రి యాజమాన్యం ఈ మొత్తాన్ని తప్పును అంగీకరించినందుకు కాదని, మానవతా దృక్పథంతో, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సానుభూతి పరంగా అందించినట్లు స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో 'తప్పు లేదంటూనే పరిహారం ఎందుకు?' అనే ప్రశ్న కూడా తెరపైకి వచ్చింది.

### వైద్య రికార్డులే కీలకం

పావని మృతికి అసలు కారణాన్ని నిర్ధారించేందుకు గత వైద్య చరిత్ర, అబార్షన్‌కు సంబంధించిన రికార్డులు, స్కానింగ్ నివేదికలు, ఆపరేషన్ నోట్లు, అనస్థీషియా రికార్డులు, చికిత్స వివరాలు, అత్యవసర సమయంలో తీసుకున్న చర్యలు, మృతదేహ పరీక్ష నివేదికలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.
గత చికిత్స జీఎన్‌ఆర్ ఆస్పత్రిలో జరిగిందా? రమేష్ ఆస్పత్రిలో జరిగిందా? లేక మరెక్కడైనా జరిగిందా? అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. సంబంధిత ఆస్పత్రుల వైద్య రికార్డులను అధికారులు పరిశీలిస్తేనే వాస్తవం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### సమగ్ర విచారణతోనే వాస్తవాలు

పావని మృతి వైద్య నిర్లక్ష్యమా, గత చికిత్సలో మిగిలిన అవశేషాల కారణంగా ఏర్పడిన సంక్లిష్టతా, చికిత్స సమయంలో తలెత్తిన అత్యవసర పరిస్థితి కారణమా, లేక మరేదైనా కారణమా అన్నది నిష్పాక్షిక వైద్య విచారణతోనే తేలాల్సి ఉంది.
అలాగే లింగ నిర్ధారణ ఆరోపణల్లో వాస్తవమెంత? గత అబార్షన్ ఎక్కడ జరిగింది? ఎవరు నిర్వహించారు? ప్రస్తుత చికిత్సకు ముందు అవసరమైన పరీక్షలు, వైద్యపరమైన జాగ్రత్తలు తీసుకున్నారా? అన్న ప్రశ్నలకు అధికారిక దర్యాప్తు సమాధానం చెప్పాల్సి ఉంది. ఆధారాలు, వైద్య రికార్డులు, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా స్వతంత్ర విచారణ జరిపితేనే పావని మృతి వెనుక అసలు కారణం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## కార్యకర్తల కుటుంబాలకు టీడీపీ అండ

**ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**100 సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద బీమా**



**శ్రీ సత్య సాయి/కదిరి, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
కార్యకర్తల కుటుంబాలకు కష్టకాలంలో తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. టీడీపీ సభ్యత్వం పొందిన కార్యకర్తలకు కేవలం రూ.100 సభ్యత్వ రుసుముతో రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. తలుపుల మండలం ఉడుములకుర్తి పంచాయతీ బండమీదపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త భరత్ నరసింహమేడ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన టీడీపీ సభ్యత్వం కలిగి ఉండటంతో కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా మంజూరైంది. ఈ మేరకు భరత్ నరసింహమేడ తండ్రి మేడ ఓబయ్య ప్రసాద్‌కు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రమాద బీమా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమం కోసం నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. దేశంలో మరే రాజకీయ నాయకుడు ఆలోచించని విధంగా కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కేవలం రూ.100 సభ్యత్వ రుసుముతో రూ.5 లక్షల ప్రమాద బీమా అందించడం కార్యకర్తల పట్ల పార్టీకి ఉన్న బాధ్యతకు నిదర్శనమన్నారు.కుటుంబం కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌కు భరత్ నరసింహమేడ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## గర్భిణులకు 24 గంటల ఉచిత ఆటో సేవ

**అత్యవసర వేళల్లో 510 నిమిషాల్లో ఇంటి వద్దకు ఆటో**

**ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఉచిత ప్రయాణ సదుపాయం**

**నాలుగేళ్లుగా కొనసాగుతున్న సేవా కార్యక్రమం**




**గుత్తి ఆగస్టు 26 (రిపబ్లిక్ న్యూస్):**
గర్భిణీ స్త్రీలకు అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లేందుకు ఇక ప్రయాణ ఇబ్బందులు ఉండవని సోషల్ సర్వీస్ గుత్తికి చెందిన నజీర్ తెలిపారు. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని గర్భిణుల కోసం 24 గంటల పాటు ఉచిత ఆటో సేవ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అవసరమైన సమయంలో ఒక్క ఫోన్ కాల్ చేస్తే 5 నుంచి 10 నిమిషాల్లోపు ఆటోను ఇంటి వద్దకు వస్తుందని, వారు వెళ్లాలనుకున్న ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆస్పత్రికి సురక్షితంగా చేర్చుతున్నట్లు తెలిపారు.
**నాలుగేళ్లుగా ఉచిత సేవ:**గర్భిణులకు అత్యవసర సమయంలో రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత ఆటో సేవను ప్రారంభించి దాదాపు నాలుగేళ్లు పూర్తయినట్లు నజీర్ తెలిపారు. ఈ కాలంలో ఎంతోమంది గర్భిణులను ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు ఉచితంగా తరలించినట్లు చెప్పారు. చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వెళ్లేందుకు కూడా ఇబ్బందులు లేకుండా ఉచిత ఆటో సేవ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.
**ఒక్క ఫోన్ కాల్‌తో..:**గర్భిణీ స్త్రీలకు ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం వచ్చినప్పుడు 7702985362 నంబర్‌కు ఫోన్ చేయాలని నజీర్ సూచించారు. ఫోన్ చేసిన 5 నుంచి 10 నిమిషాల్లోపు ఆటోను ఇంటి వద్దకు వస్తుందని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పూర్తయిన తర్వాత కూడా అదే నంబర్‌కు ఫోన్ చేస్తే ఆస్పత్రి నుంచి ఇంటి వరకు ఉచితంగా ఆటోలో తీసుకొచ్చి డ్రాప్ చేస్తామని చెప్పారు.

## మద్దూరు గ్రామంలో ఘనంగా గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

**:-జి. తిమ్మారెడ్డి(నీటి సంఘము చైర్మన్)**





**పాములపాడు ఆగష్టు-26 రిపబ్లిక్ న్యూస్:-**
పాములపాడు మండలంలోని, మద్దూరు గ్రామంలో ఈరోజు నూతనంగా గంగమ్మ విగ్రహం ప్రతిష్ట చేశారు. అలాగే ఈ గ్రామ పంచాయతీలోని, మద్దూరు, కృష్ణానగర్, పెంచికలపల్లె గ్రామాలలో విగ్రహ ప్రతిష్టకు ముందు వీధి వీధిన గ్రామ పొలిమేరల నందు, సన్నాయి మేళాలతో వేదమంత్రాలు నడుమ, ఘనంగా విగ్రహాలను ఊరేగింపు చేశారు. అనంతరం మద్దూరు గ్రామంలో నీటి సంఘం చైర్మన్ జి.తిమ్మారెడ్డి దంపతులు మరియు మద్దూరు, కృష్ణానగర్, పెంచికలపల్లె గ్రామాల ప్రజలందరూ కలిసి విగ్రహం ప్రతిష్టించడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి సీనియర్ నాయకుడు జి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ అందరి రైతులకు పాడిపశువుల యందు, పంటల యందు, నీటి ఎద్దడి లేకుండా గంగమ్మ తల్లి దీవెనలతో కరుణించి మన అందరిని సుఖ సంతోషాలతో దీవించాలని కోరుతున్నామని అన్నారు.

## ఇంటి స్థలం విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ


**కత్తి తో బర్మే నాగార్జున పై దాడి**



**చిప్పగిరి, ఆగస్టు, 26, (రిపబ్లిక్ న్యూస్)** మండల కేంద్రమైన చిప్పగిరి లో బర్మే నాగార్జున, బర్మే నాగేష్, అన్నదమ్ముల మధ్య స్థల విషయంలో తీవ్రమైన ఘర్షణ చోటుచేసుకుంది. బుధవారం బర్మె నాగర్జున పై నాగేష్ కత్తి తో దాడి చేసినట్లు దాడిలో నాగార్జున తీవ్రంగా గాయపడడంతో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించినట్లు ఎస్సై సి. వెంకట నరసింహులు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి అన్నదమ్ముల మధ్య ఇంటి స్థలం గోడ కట్టుకునే విషయంలో గొడవ చోటు చేసుకుందని తెలిపారు. దీంతో మనసులో ఉంచుకున్న బర్మే నాగేష్, బుధవారం ఉదయం చిప్పగిరి స్థానిక బస్టాండ్ దగ్గర ఉన్న బ్రాందీ షాపు ప్రక్కన ఉన్న నాగార్జునను చికెన్ నరికే కత్తి తో దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. దీంతో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సి .వెంకట నరసింహులు తెలిపారు.

# మహమ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శనీయం

**చిప్పగిరి, ఆగస్టు, 26, (రిపబ్లిక్ న్యూస్ )**
మిలాద్ ఉన్ నబీ సందర్భంగా చిప్పగిరిలో బుధవారం యువకులు జెండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మతపెద్దలు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవతా విలువలను ప్రజలు ఆచరించాలని కోరారు.మిలాద్ ఉన్ నబీ వేడుకలను పురస్కరించుకుని గ్రామంలోని బాబా ఫక్రుద్దీన్ మఖాన్ నుంచి సయ్యద్ అబ్దుల్ సత్తార్ వలి దర్గా వరకు యువకులు జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. ప్రవక్త జీవిత విశేషాలను వివరించారు. చిప్పగిరి మండలంలోని ఏరూరు, రామదుర్గం నేమకల్లు, నగర్ డోన గ్రామాల్లో మీలాగున్నది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ముల్లా పెద్ద సతార్



వలి, దాదా కలందర్, జీయం భాష, ముస్తఫా, ముల్లా సమీర్ భాష, అంగిడి హుసేని, రాంపేట వన్నూరు సాబ్, రజాక్ మియా, శర్మష్ వలి, యువకులు,



మతపెద్దలు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నమాజులు చదివి సలాములు, ఫాతిహా నిర్వహించారు.

# తైక్వాండోలో అన్నాచెల్లెళ్ల ప్రతిభ

**అంతర్జాతీయ పోటీల్లో రాణించిన మగ్బూల్ బాషా,**

**హజరాబీకి ఎమ్మెల్యే పరిటాల సునీత అభినందన**

**నూతన ఎస్ఐ లక్ష్మణరావుతో మర్యాదపూర్వక భేటీ**

**అనంతపురం స్పోర్ట్స్, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
అంతర్జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన అన్నాచెల్లెళ్లు మగ్బూల్ బాషా, హజరాబీలను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభినందించారు. అనంతపురం మండలం తపోవనం సమీపంలోని స్వర్ణగ్రామం వద్ద శిక్షణ పొందుతున్న వీరు జూలైలో బెంగళూరులో నిర్వహించిన దక్షిణ భారత స్థాయి తైక్వాండో పోటీల్లో పసిడి పతకాలు సాధించారు. వారి ప్రతిభ ఆధారంగా హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.
ఈ నెల 21 నుంచి 23 వరకు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో మగ్బూల్ బాషా, హజరాబీ అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో శిక్షకుడు మహబూబ్ బాషా, ఇద్దరు చిన్నారులతో కలిసి బుధవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిశారు. చిన్నారుల విజయాల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని అభినందించారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. శిక్షకుడు మహబూబ్ బాషాను కూడా ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా చిన్నారులను ప్రోత్సహించాలని సూచించారు.
ఆత్మకూరు నూతన ఎస్ఐగా నియమితులైన లక్ష్మణరావు ఎమ్మెల్యే పరిటాల సునీతను అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆత్మకూరు మండలంలోని ప్రస్తుత పరిస్థితులు, శాంతిభద్రతల అంశాలపై చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ లేకుండా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసు శాఖకు తమవైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు.






# రాయికల్ పట్టణ మున్సిపల్ చిల్డ్రన్ పార్క్ ప్రారంభం కాకముందే వస్తువులను ఎత్తుకెళ్లిన దొంగలు -?

### మున్సిపల్ పాలకవర్గము, అధికారుల పర్యవేక్షణ లేక పార్కులో గుత్తేదార్ అభివృద్ధి పనులు పూర్తికాకముందే బిగించిన వస్తువులు ఎత్తు కెళ్ళినా కాంట్రాక్టర్ అని ప్రజల ఆరోపణ

**రాయికల్ మండలం ఆగస్టు,26( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో కోటి 30 లక్షలతో చిల్డ్రన్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆట్టి చిల్డ్రన్ పార్క్ నిర్మాణంలో అనేక అవకతవకలు జరిగినాయి అని ప్రజలు ఆరోపిస్తున్నారు

రాయికల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చిల్డ్రన్ పార్కు నిర్వహణ అభివృద్ధి పనులపై విమర్శలు వెలువెత్తుతున్నాయి, పట్టణానికి దూరంగా, పెద్ద చెరువు సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఈ పార్కు సుందరీ కరణ పనులు పూర్తికాకముందే ఇక్కడ బిగించిన కొన్ని వస్తువులను దొంగలు తీసుకెళ్లిన ఘటన చర్చనీయాంశంగా మారింది. పార్క్ లో భాగంగా ఏర్పాటు చేసిన వస్తువులను చేపట్టిన వ్యక్తి తొలగించి తీసుకెళ్లినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు, పనులకు సంబంధించిన




బిల్లులు చెల్లింపులు, గుత్తేదారుకు సంబంధించిన వ్యవహారాల తీరు ఈ వస్తువులను తొలగించారా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, ఇప్పటికీ పార్కు అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని స్థానికులు ఆశీటున్నారు, ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు నిర్మాణ పనుల్లో జాప్యం చోటు చేసుకోవడంతో పాటు బిగించిన వస్తువులు తిరిగి తొలగించబడటం అధికారుల పర్యవేక్షణ పై ప్రశ్నలు తలెత్తేలా చేస్తుంది, పనులకు పార్కు పనులకు సంబంధించిన బిల్లులు, చెల్లింపులు గుత్తేదారు పనుల వివరాలు, తొలగించిన సామాగ్రిని సామాగ్రిని పార్కు అంశాలపై మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు, ప్రజా ధనంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పారదర్శకత పాటించి, పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూన్నారు.

# ఏపీఎస్ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం ఏకగ్రీవ ఎంపిక




పి. శంకరప్ప అధ్యక్షులు


పి. సురేంద్ర కార్యదర్శి


కే. హరికుమార్ కోశాధికారి

**శ్రీ సత్య సాయి/కదిరి, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):** ఏపీఎస్ఆర్టీసీ కదిరి డిపో బీసీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కదిరిలోని ఏపీ ఎన్జీవో సమావేశ భవనంలో బీసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. కమిటీ అధ్యక్షుడిగా పి. శంకరప్ప, కార్యదర్శిగా పి. సురేంద్ర, కోశాధికారిగా కే. హరికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డీఎల్ నారాయణను ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా జి. రామకృష్ణ, ఎస్. వెంకటప్ప, ప్రచార కార్యదర్శిగా అనిల్ సింహ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా కె. జయశ్రీ, ఈ. పురుషోత్తం, డీవీ. రమణ, ఎస్వీ. రత్నం బాధ్యతలు చేపట్టనున్నారు. సంయుక్త కార్యదర్శులుగా ఎస్. కన్యాకుమారి, సి. రహమతుల్లా, మల్లికార్జున, సుహానా బేగం, డీజే. మోహన్, సహాయ కార్యదర్శులుగా టి. రాజ్‌కుమార్, పి. శివయ్య, రామ్మోహన్, ఏఎస్. వాసులు, ఏఎన్. అహ్మద్‌లను ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఈఎన్ఎస్. రావు, జి. సురేష్, జి. రమాదేవి, బి. లక్ష్మీదేవమ్మ, జీవీ. రమణ ఎంపికయ్యారు. బీసీ ఉద్యోగుల సంఘం ముఖ్య సలహాదారుడు జి. రామకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా తాలూకా బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జీవీ. రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు, టీఎన్‌యూఎస్‌సీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర నాయుడు, బహుజన పార్టీ అధ్యక్షుడు హంపాపతి గోవిందు, ఉద్యోగుల సంఘం నాయకులు కే. కృష్ణయ్య, తనకల్లు శంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారానికి ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమానికి కదిరి డిపోకు చెందిన బీసీ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోండి

## సబ్ ఇన్స్పెక్టర్ సృజన్ కుమార్.

**రైల్వే కోడూరు ఆగస్టు 26 రిపబ్లిక్ న్యూస్.**
వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఓబులవారిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ సృజన్ కుమార్ వినాయక చవితి ఉత్సవ కమిటీ లకు సూచించారు. ఓబులవారిపల్లి మండలం లోని అన్ని పంచాయతీల వినాయక చవితి ఉత్సవ కమిటీలను బుధవారం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేయడం జరిగినది,రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ఆయా గ్రామాలలోని ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్థులతో కలిసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో, శాంతియుత మార్గంలో గ్రామస్తుల అందరి అభిమతం నిర్వహించుకోవాలని ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక చవితి ఉత్సవ విగ్రహాల ఏర్పాటు,, నిమజ్జన కమిటీ సభ్యులతో బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి మండలంలోని అన్ని పంచాయతీల ఉత్సవ కమిటీ లు సమావేశమునకు హాజరవడం జరిగినది, ఈ సందర్భంగా ఎస్సై సృజన్ కుమార్ మాట్లాడుతూ ఓబులవారిపల్లి మండలం గతంలో కడప జిల్లాలో ఉండేదని అటు తర్వాత అన్నమయ్య జిల్లాలో కలిసిందని కొన్ని పరిస్థితుల వల్ల అన్నమయ్య జిల్లా నుండి విడిపోయి తిరుపతి జిల్లాలో కలవడం జరిగినదని ఈ జిల్లాకు ప్రపంచ పటంలో ఒక ప్రత్యేక స్థానం ఉందని ప్రపంచ పటంలో తిరుపతి తిరుమల అంటే తెలియని భక్తులు ఉండాలని ప్రపంచంలో తిరుపతికి అనేకమంది భక్తులు ఉన్నారని ఇది ఆధ్యాత్మిక కేంద్రమని ప్రతినిత్యం లక్షలలో భక్తులు స్వామిని దర్శనం చేసుకుంటున్నారని అంతటి శక్తి కలిగిన ప్రాంతం తిరుపతి తిరుమల అని సబ్ ఇన్స్పెక్టర్ సుజన్ కుమార్ సభ ముఖముగా తెలియజేశారు అందువల్ల ఆధ్యాత్మికముగా అత్యంత ప్రాధాన్యత కలిగిన తిరుపతి జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలు జరగనున్న సందర్భంగా మండలంలోని ఉత్సవ కమిటీ సభ్యులు తగు జాగ్రత్తలు పద్ధతులు నియమ నిబంధనలు పాటించి వినాయక చవితి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఎస్ఐ సృజన్ కుమార్ కమిటీ సభ్యులకు తెలియజేశారు అంతేకాకుండా వినాయక చవితి ఉత్సవ సందర్భంగా డీజే లను ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నిషేధం విధించడం జరిగినదని పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉన్నందువల్ల ఈ నిబంధన తప్పనిసరిగా మండలంలోని ఉత్సవ కమిటీ సభ్యులు అందరూ పాటించాలని, చిన్న సౌండ్ తో రెండు స్పీకర్లు పెట్టుకుని ఆధ్యాత్మిక పాటల మాత్రమే ప్లే చేయవలసి ఉంటుందని అభిమానం ఉన్నట్లు పాటలు



డాన్సులు ఇతరత్రా నిషేధించడమైనది ఆయన తెలియజేశారు, ఉత్సవాల సందర్భంగా మైనర్లు నియమ నిబంధనలకు విరుద్ధంగా మద్యం, మాదకద్రవ్యాలు ఇతరతర సేవించి ఉత్సవంలో పాల్గొనాలని ఏ సమయంలోనైనా పరీక్ష లు నిర్వహించడం జరుగుతుందని పట్టుబడితే కఠిన చర్యలు తప్పు అని మైనర్లకు సృజన కుమార్ ప్రత్యేకంగా తెలియజేశారు అంతేకాకుండా ఆధ్యాత్మికతతో అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని నిర్వహించాలని కమిటీ సభ్యులు ఇతరులు ఎవరు కూడా మత్తు పదార్థాలు పానీయాలు సేవించి దైవ కార్యక్రమాలు నిర్వహించడం సహించరాన్ని నేరమని ఇది గ్రహించి గ్రామంలోని అందరూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్సై సుజన్ కుమార్ అన్నారు, రైల్వేకోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు ఆదేశాల మేరకు వినాయక విగ్రహాల ఏర్పాటు కోసం తీసుకోవాల్సిన అనుమతులు, పండుగ నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, నిమజ్జన కార్యక్రమానికి చేయాల్సిన ఏర్పాట్లపై కమిటీ సభ్యులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఓబులవారిపల్లి మండల పరిధిలోని అన్ని పంచాయతీలలో విగ్రహాలు ఏర్పాటు చేయదలచిన నిర్వాహకులు ప్రతి గ్రామం నుంచి కనీసం ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసుకుని, అనుమతి కోసం ఉత్సవ కమిటీ సభ్యులు అందరూ పోలీస్ స్టేషన్కు వచ్చి వినతి పత్రం సమర్పించి అనుమతి పొందాలని ఆయన కోరారు,

వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, మద్యం సేవించి గొడవలకు దిగడం, అల్లర్లు సృష్టించడం, గ్రామస్తులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరించడం చేయరాదని ఎస్సై హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు, తీసుకుని కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిం చాలాన్నారు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఎవరికైనా ఎలాంటి అనుమానాలు ఉన్న అడగవచ్చని సబ్ ఇన్స్పెక్టర్ సూచించగా పలువురు కమిటీ సభ్యులు నిమజ్జన మరియు





డీజే విషయాలపై అడగగా ఎస్సై సుజన్ కుమార్ సున్నితమగా డీజే లకు అనుమతి లేదని నిమజ్జన విషయంలో మీకు అనుకూలంగా తగు చర్యలు రక్షణ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలియజేశారు, అనంతరం పోలీస్ కానిస్టేబుల్ భాస్కర్ సబ్ ఇన్స్పెక్టర్ సృజన్ కుమార్ అనుమతితో కమిటీ సభ్యులకు నియమ బంధనలను తెలియజేశారు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని మాదకద్రవ్యాలు, మత్తు పానీయాలకు ప్రజలు దూరంగా ఉండాలని మైనర్లు జాగ్రత్తగా వివరించాలని ఆయన సూచించారు కార్యక్రమంలో ఏఎస్ఐ రమణ , పెంచలయ్య ప్రకాష్ హరి వర్మ తదితరులు సిబ్బంది పాల్గొన్నారు, వివిధ గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు సిబ్బంది అన్ని విధాల ఉత్సవ కమిటీలకు సహాయ సహకారాలు అందిస్తుందని మదకదవ్యాలు మత్తు పానీయాలు గంజాయి వంటి తదితర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అత్యవసర సమయంలో 112 కు కాల్ చేసి సహాయాన్ని పొందవలసిందిగా ఆయన కోరారు ఈ కార్యక్రమంలో తుమ్మల రాజు సుబ్బరాజు, వడ్డిపల్లి వాసు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**బండి ఆత్మకూరు, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):-** బండి ఆత్మకూరు మండలం, జి.సీ.పాలెం గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి టీటీడీ శ్రీ వాణి ట్రస్ట్ అధికారి నవీన్ గ్రామ ప్రజలతో కలిసి భూమి చేశారు. బుధవారం స్థానిక టిడిపి నాయకులు కంచెర్ల చిన్న లింగారెడ్డి, ఆయన సతీమణి కంచెర్ల శోభారాణిల ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరయినట్లు ఆలయ అధికారులు తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామంలో నూతన ఆలయ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరైనట్లు స్థానికులు తెలిపారు. దీంతో శ్రీశైలం ఎమ్మెల్యేకు గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్బయ్య, మోహనరావు,గోపాల్, వై.రమణ, ప్రసాద్, వై.శ్రీను, శివుడు, లక్ష్మీరెడ్డి, సుబ్బారెడ్డి,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు - ఎస్ఐ జగన్మోహన్




**బండి ఆత్మకూరు, ఆగస్టు 26,( రిపబ్లిక్ న్యూస్):-** వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని గణేష్ ఉత్సవ కమిటీలు గ్రామాల్లో ఏర్పాటు చేసే గణేష్ మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని ఎస్సై జగన్మోహన్ సూచించారు. బుధవారం అయిన స్థానిక పోలీస్టేషన్లో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సవ కమిటీలకు పలు కీలక సూచనలు చేశారు. ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని కమిటీ సభ్యులకు ఎస్సై సూచించారు. ముఖ్యంగా గణేష్ మండపాల వద్ద డీజేలు ఏర్పాటు చేసి సినిమా పాటలు పెట్టి అసభ్యకర నృత్య ప్రదర్శన వంటి కార్యక్రమాలు చేయరాదన్నారు. అలా కాకుండా భక్తులకు అవసరమైన సేవా కార్యక్రమాలు చేపట్టి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. అలాగే నిమజ్జన సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేసుకొని భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్ మండల బిజెపి ఇన్చార్జిగా కల్లేడ ధర్మపురి పట్టణ ఇన్చార్జిగా శ్రీకాంత్ రెడ్డి


**రాయికల్ మండలం ఆగస్టు,26( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండల భారతీయ జనతా పార్టీ ఇన్చార్జిగా కల్లెడ ధర్మపురి,పట్టణ ఇన్చార్జిగా శ్రీకాంత్ రెడ్డిని నియమించిన జగిత్యాలబిజెపి జిల్లా అధ్యక్షులు రాచకొండ యాదగిరి బాబు ఇంతవరకు ఉన్న కమిటీలను రద్దు చేస్తూ కొత్తగా వీరిని నియమించారు వీరి నియామక పట్ల రాయికల్ బిజెపి నాయకులు కురుమ మల్లారెడ్డి,సతీష్, శంకర్, రాము హర్షం వెలుబుచుతూ శ్రీకాంత్ రెడ్డి కి ధర్మపురికి శుభాకాంక్షలు తెలిపారు




# కట్కాపూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను, పూల మొక్కలను పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి


**రాయికల్ మండలం ఆగస్టు,26( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కాట్కపూర్ గ్రామంలోరాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డ్స్ పంపిణీ చేసిన గ్రామ సర్పంచ్ పడాల పూర్నిమా తిరుపతిఅలాగే ప్రత్యేకంగా గ్రామంలో ప్రతి ఇంటింటికి శంకు పూల మొక్కలు పంపిణీ చేయడం జరిగింది గ్రామంలో పూల మొక్కలు పెంచడం వలన గ్రామమంతా కూడా అలధకరంగా మరియు అందంగా కనిపిస్తుందని మరియు మొక్కలు పెంచడం వలన ఆక్సిజన్ అందుతుంది ముందు తరాలకు మంచి భవిష్యత్తు కూడా ఇచ్చినట్లు అవుతుందని సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ పద్మయ్య కార్యదర్శి రాజశ్రీ జిపిఓ లావణ్య వార్డు మెంబర్లు రంజిత్ రాజులు రాజు పద్మ లక్ష్మి మహిళా సంఘాల వివోలు సంఘాల అధ్యక్షులు వార్డు మెంబర్లు మరియు గ్రామస్తులు గ్రామ పెద్దలు మహిళలు అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది, పడాల తిరుపతి సర్పంచ్ స్థానంలో గిరదావర్ వారి దాసరి పద్మయ్య ముందరనే కూర్చుండడం అధికార కార్యక్రమంలో పాల్గొనడం పలువురు గ్రామస్తులు విమర్శించారు






# ఆర్థికపతనం దిశగా .. అమెరికా ఫస్ట్ నినాదం !

**ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
ఇరాన్‌తో జరిగిన యుద్ధం, అంతర్జాతీయంగా వివిధ దేశాలతో అనుసరిస్తున్న విధానా వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతోంది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల సామాన్య పౌరులను చికాకు పెట్టిస్తోంది. ఇప్పటికే అక్కడ గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి. నిత్యాసవర ధరలు కూడా పెరిగాయి.




ఇరాన్‌తో యుద్ధం వల్ల అమెరికా ఓ రకంగా చతికిలపడిందనే చెప్పాలి. ఈ అనుభవం రష్యాకు కూడా వచ్చింది. ఉక్రెయిన్‌పై దాడులు రష్యానూ దెబ్బతీసాయి. యుద్ధాలతో విజయం దక్కకపోగా... ఆర్థిక రంగంలో వైఫల్యాలలు తీవ్రమవుతున్నాయి. దేశంలో సగటు పౌరులు ట్రంప్‌ను ఎన్నుకున్నందుకు బాధ పడుతున్నారు. ప్రపంచంతో సక్రమమైన సంబంధాలు కోల్పోవడంతో వారు అనేక రంగాల్లో ఇబ్బందులు పడుతున్నారు.వలసలపై ఆంక్షలు, ప్రపంచ దేశాలపై విచక్షణారహిత సుంకాల సమరం అమెరికాను అన్ని విధాల దెబ్బతీస్తున్నాయి. భౌగోళిక రాజకీయాలలోను, అంతర్జాతీయ ఆర్థిక రంగంలోనూ అభ్యుదయానికి కాకుండా అరాచకానికి ట్రంప్ కారకుడు అవుతున్నారు. భారత్ సహా వర్ధమాన దేశాలన్నీ ఆర్థిక సంక్షోభం అంచుకు చేరుతున్నాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా పరోక్షంగా అమెరికాను కూడా ముంచుతున్నాయి. అయినా ట్రంప్ ఇవేవీ గమనించడం లేదు. వచ్చే నవంబర్‌లో మధ్యంతర ఎన్నికలకు వెళ్లుతున్న అమెరికా ట్రంప్‌కు మద్దతుగా నిలుస్తుందా అనుమానాలు బయలుదేరాయి. లేక కొత్త ప్రస్థానాన్ని ప్రారంభిస్తుందా అని ప్రపంచమంతా ఎదురుచూస్తున్న విషయమిది. అమెరికాకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది వేరుగా చర్చించుకోవాల్సిన అవసరం లేదు. నిరంతర యుద్ధ వ్యయాలు, సంపన్న వర్గాలకు పెద్ద ఎత్తున పన్ను కోతలు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఉక్రెయిన్, ఇరాన్ యుద్ధాల మూలంగా తీవ్రమవుతున్న ఇంధన, సరఫరాల సంక్షోభాలు కూడా తోడయ్యాయి. అంతర్జాతీయ కరెన్సీగా డాలర్ ప్రాబల్యం తగ్గడం మొదలైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య విధానాలు పరిస్థితిని మరింతగా దిగజార్చి వేస్తున్నాయి. ఫలితంగా అమెరికా జాతీయ రుణం ఆ దేశ స్థూల దేశియోత్పత్తిలో 126 శాతంగా ఉన్నది. పోటీదారు అయిన చైనా జాతీయ రుణం జీడీపీలో 83 శాతంగా మాత్రమే ఉండగా జపాన్ జాతీయ రుణం జీడీపీలో ఇంచుమించు 250 శాతంగా ఉన్నది. అయితే జపాన్ ప్రభుత్వం తీసుకున్న రుణాలలో అత్యధికం దేశీయ బ్యాంకులు, మదుపుదారుల నుంచి తీసుకున్నవే. అమెరికా తనకు అవసరమైన నిధులను చాలా వరకు ఫెడరల్ రిజర్వ్ బాండ్లను విక్రయించడం ద్వారా సమకూర్చుకుంటున్నది. ఈ బాండ్ల కొనుగోలుదారులలో అత్యధికులు విదేశీ సంస్థలు, మదుపుదారులే కావడం గమనార్హం. ఈ భారీ రుణంపై ఏటా 1 లక్ష కోట్ల డాలర్లకు పైగా వడ్డీ చెల్లిస్తున్నారు. అమెరికా ప్రభుత్వ బాండ్లను కొనుగోలు చేసినవారు నష్టాలు వాటిల్ల వచ్చనే భయంతో వాటిని విక్రయిస్తున్నారు. తక్కువ వడ్డీ రేట్లకు ఆ బాండ్లను మరిన్ని కొనడానికి నిరాకరి స్తున్నారు. ఈ పరిస్థితి కూడా అమెరికా రుణ సంక్షోభానికి దారితీసింది. దీని నుంచి బయట పడేందుకు తాను అమ్మిన బాండ్లను తానే కొనుగోలు చేసేందుకు అమెరికా సంసిద్ధమయినప్పటికీ పరిస్థితి మెరుగు పడడం లేదు. ఫెడరల్ ప్రభుత్వం తీసుకునే రుణం గరిష్ఠంగా 41.1 ట్రిలియన్ డాలర్లకు మించకూడదని గత ఏడాది అమెరికా కాంగ్రెస్ పరిమితి విధించింది. అయితే అంతకంతకూ పెరుగుతోన్న జాతీయ రుణ పరిమాణం ఆ గరిష్ఠ పరిమితిని 2027 ద్వితీయార్థంలో దాటుతుందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. ఇదంతా కూడా వాణిజ్య విధానాల కారణంగానే అని చెప్పుకోవాలి. వివిధ దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించడంతో స్వేచ్ఛా వాణిజ్యం దెబ్బతింది. ప్రతిసెకనూ 90వేల డాలర్ల మేరకు, దినసరిన 7.8 బిలియన్ డాలర్ల మేరకు జాతీయ రుణం పెరుగుతుందని
కాంగ్రెస్ జాయింట్ ఎకనామిక్ కమిటీ వెల్లడించింది. 2036 సంవత్సరం నాటికి ఈ రుణభారం 64 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని కూడా ఆ కమిటీ పేర్కొంది ప్రతి అమెరిన్ పౌరుడిపై తలసరి రుణభారం 1,19,686 డాలర్లుగా లెక్క కట్టింది. అమెరికాకు ఈ రుణ దుస్థితి దాపురించడానికి డెమొక్రాటిక్, రిపబ్లికన్ ప్రభుత్వాలు రెండూ కారణమయినప్పటికీ డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు మరింత దిగజార్చా యని అమెరికన్‌లే గగ్గోలు పెడుతున్నారు. అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేస్తానన్న ట్రంప్ నిజానికి అమెరికా పతనాన్ని మరింత వేగవంతం చేస్తున్నారని అనేకులు వాపోతున్నారు. అమెరికా ఫస్ట్ నినాదం ఇప్పుడు ఆర్థిక పనం దిశగా సాగుతోంది.

## అమెరికా మరో దుందుడుకు చర్య

### వీసా ఇంటర్వ్యూల నిలిపివేత

**వాషింగ్టన్,ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇమిగ్రేషన్ విధానాలతో వలసదారుల్ని వణికిస్తున్నారు. తాజాగా అమెరికా ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్‌మెంట్లను అర్ధంతరంగా నిలిపివేసింది. కొన్ని షెడ్యూల్డ్ ఇంటర్వ్యూలను రద్దు చేసిందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ రాయబార కార్యాలయాలు, కాన్సులేట్‌లలో శిక్షణా కార్యక్రమం ప్రారంభమైందని, దానిలో భాగంగానే వీసా అపాయింట్‌మెంట్ల సర్దుబాటు జరుగుతుందని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ అయిన దరఖాస్తుదారులకు రద్దుపై మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. రీషెడ్యూలింగ్ సమయం గురించి త్వరలో తెలియజేయనున్నారు. రాయబార కార్యాలయాల్లో నిర్వహిస్తోన్న శిక్షణ కార్యక్రమం దేని గురించి, అది ఎంతకాలం కొనసాగుతుందనే దానిపై విదేశాంగ శాఖ పూర్తి వివరాలు వెల్లడించలేదు. అయితే.. యూఎస్ ప్రభుత్వ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న దరఖాస్తుదారులను కాన్సులర్ అధికారులు వడపోసి, తొలగించేలా ఈ శిక్షణా కార్యక్రమం ఉండనున్నట్లు తెలుస్తోంది.




## భూతనాథ సరస్సులో ఆరు మృతదేహాలు లభ్యం

### పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు

**బెంగళూరు,ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
కర్ణాటకలోని భూతనాథ సరస్సులో ఈ రోజు ఉదయం ఆరు మృతదేహాలు లభ్యమవడం కలకలం రేపింది. ఇంకా ఏవైనా మృతదేహాలు ఉన్నాయా అని పోలీసులు గాలిస్తున్నారు. ప్రముఖ చారిత్రక పట్టణమైన బాదామిలో గుహాలయాలకు కింది భాగంలో భూతనాథ సరస్సులో స్థానికులు బుధవారం ఆరు మృతదేహాలను గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సరస్సులో ఇంకా ఏవైనా మృతదేహాలు ఉన్నాయేమోనని గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలు లభ్యమైన సరస్సు ప్రముఖ పర్యటక ప్రాంతం అయినందున దీనిని వీక్షించేందుకు వచ్చి ప్రమాదవశాత్తు సరస్సులో పడి చనిపోయారా?, ఏమైనా ఆత్మహత్యా కోణమా?, ఎగువ నుంచి ఏమైనా కొట్టుకొచ్చాయా?, వీరితోపాటు ఇంకెవరైనా ఉన్నారా?, వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారా? అనే దిశగా పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం

### డిజిటల్ అరెస్ట్‌కు గురైన రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి

### సకాలంలో స్పందించిన సైబర్ క్రై మ్ పోలీసులు

**హైదరాబాద్,ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
'డిజిటల్ అరెస్ట్' పేరుతో 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో చోటు చేసుకుంది. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఎన్ఐఎ అధికారినంటూ గుర్తుతెలియని వ్యక్తి బాధితుడికి ఫోన్ చేశాడు. ఆయన ఆధార్ వివరాలతో రూ.2.50 కోట్ల మోసం జరిగిందని రిటైర్డ్ ఉద్యోగిని నిందితుడు భయపెట్టాడు. అనంతరం ఈ కేసు నుంచి బయట పడేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెరిఫికేషన్ పేరుతో నమ్మించి.. తన బ్యాంక్ ఖాతాలో రూ.85.20 లక్షలు జమ చేయాలని బాధితుడికి సైబర్ కేటుగాడు సూచించాడు. నిందితుడి మాటలు నమ్మిన బాధితుడు ఆ మొత్తాన్ని అతను సూచించిన ఖాతాలో జమ చేశాడు. మరో రూ.42 లక్షలు చెల్లించాలని నిందితుడు డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. దీంతో సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన రిటైర్డ్ ఉద్యోగి.. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్లో ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన తెలంగాణ సైబర్ పోలీసులు.. కోయంబత్తూరులోని ఐడిఎఫ్‌సి బ్యాంక్ బ్రాంచ్‌లో నిందితుడి ఖాతాను గుర్తించి, అందులో ఉన్న రూ.85.20 లక్షలను ఫ్రీజ్ చేశారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ప్రజలకు తెలంగాణ సిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సూచించారు.



## మోహన్ భగవత్ కార్యక్రమంపై హమ్దానీ వ్యతిరేకత

### మేయర్ తీరుపై మండిపడ్డ అమెరికన్ సింగర్, నటి మేరీ మిల్బెన్

**న్యూయార్క్,ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
న్యూయార్క్‌లో జరగనున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కార్యక్రమంపై ఆ నగర మేయర్ జోహ్రాన్ మమ్దానీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపుతున్నాయి. మమ్దానీ వైఖరిపై అమెరికన్ సింగర్, నటి మేరీ మిల్బెన్ తీవ్రంగా స్పందించారు. మమ్దానీ, ఆయనతో ఉన్నవారు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీని వ్యతిరేకించడం వల్లే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆగస్టు 29న జరగనున్న కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగించనున్నారు. అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమెరికన్ హిందూ సమాజాన్ని ఒకతాటి పైకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు



పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంపై న్యూయార్క్ నగర మేయర్ మమ్దానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా ఇప్పటివరకు బహుళత్వం, లౌకిక విలువలు, ప్రతి ఒక్కరికీ స్థానం ఉన్న దేశంగా ఉందని, ఇలాంటి విలువలకు భిన్నంగా ఒక వర్గాన్ని వెలివేసే ధోరణి పెరగడం తనకు ఆందోళన కలిగిస్తోందని మమ్దానీ పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించనున్న కార్యక్రమాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యితే ఇది ప్రైవేట్ కార్యక్రమం కావడంతో దాన్ని రద్దు చేసే చట్టపరమైన అధికారం తనకు ఉందో లేదో తెలియదని స్పష్టం చేశారు.
ర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాన్ని వ్యతిరేకించిన మమ్దానీపై అమెరికన్ సింగర్, నటి మేరీ మిల్బెన్ విమర్శలు గుప్పించారు. మోదీ, బీజేపీని వ్యతిరేకించడం వల్లే ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమాన్ని వ్యతిరేకించేవారు కావాలంటే డబ్బు సమీకరించి తమ సొంత ర్యాలీ నిర్వహించుకోవాలని సూచించారు. మోదీ వ్యతిరేకతతో మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహిస్తున్న కార్యక్రమం తనకు నచ్చిందని, భారత్‌లో మత స్వేచ్ఛపై అర్థవంతమైన చర్చ జరగాలని ఆశిస్తున్నట్లు మిల్బెన్ తెలిపారు.

### ఏఈ కుటుంబం ఆత్మహత్య కేసులో బిగ్ ట్విస్ట్..

## సాదిక్ తల్లి సంచలన వ్యాఖ్యలు


**తమ కుమారుడు నిర్దోషి అంటూ మీడియా ముందుకు వచ్చిన సాదిక్ తల్లి**

**సౌజన్యనే తమ ఇంటికి వచ్చి పెళ్లి ప్రస్తావన తెచ్చిందని వెల్లడి**

**జగదీశ్ మృతితో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరణ**

**ఆస్తుల ఆరోపణలను ఖండిస్తూ పోలీసులకు ఆధారాలు సమర్పించామన్న నూర్జహాన్**

**ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో ఊహించని మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రైఫిల్ షూటింగ్ కోచ్ సాదిక్ ఖాన్ తల్లి నూర్జహాన్ బుధవారం తొలిసారిగా మీడియా ముందుకు వచ్చి కీలక విషయాలు వెల్లడించారు. తన కుమారుడి వేధింపుల వల్లే నూకరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకుందన్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. అసలు కథ వేరే ఉందని, సౌజన్యనే తన కుమారుడిని వివాహం చేసుకోవాలని కోరిందని ఆమె తెలిపారు.కాకినాడ జిల్లాలో మీడియాతో మాట్లాడిన నూర్జహాన్, ఈ కేసుకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు చెప్పారు. "సౌజన్య రెండుసార్లు మా ఇంటికి వచ్చింది. సాదిక్‌ను పెళ్లి చేసుకుంటానని చెప్పింది. కానీ మేము ఆ ప్రతిపాదనను నిరాకరించాం. ఒకవేళ జగదీశ్వర్ రెడ్డితో వివాహం జరగకపోయి ఉంటే, సౌజన్యను సాదిక్‌కే ఇచ్చి పెళ్లి చేసేవాడ్నని నూకరాజే స్వయంగా మాతో అన్నారు" అని నూర్జహాన్ వివరించారు. సౌజన్య భర్త జగదీశ్వర్ రెడ్డి మృతితో తన కుమారుడికి ఎలాంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. పైగా, ఈ ఏడాది ఫిబ్రవరి 14న సౌజన్య ఫోన్ చేసి పిలవగా వెళ్లిన సాదిక్‌పై జగదీశ్వర్ రెడ్డి, అతని మనుషులు దాడి చేసి, కత్తితో బెదిరించారని ఆరోపించారు.భర్త సరిగా చూసుకోకపోవడం వల్లే సౌజన్య తన కుమారుడితో సంబంధం కొనసాగించిందని నూర్జహాన్ అన్నారు. సౌజన్య కుమారుడు రియాన్ష్. సాదిక్‌ను 'అబ్బు' అని, సొంత తండ్రిని 'ఇడియట్' అని పిలిచేవాడని ఆమె చెప్పడం గమనార్హం. ఫోన్‌లో సాదిక్ చెప్పే కథలు వింటూ ఆ బాలుడు నిద్రపోయేవాడని తెలిపారు. సౌజన్య తమను తెలుగు ఖురాన్, బురఖా కావాలని అడిగినట్లు కూడా ఆమె వెల్లడించారు.ఆత్మహత్య చేసుకున్న రోజు సాయంత్రం 5:30 గంటలకు సౌజన్య ఫోన్ చేసి రమ్మని పిలిచిందని, అయితే కేరళలో విద్యార్థుల కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండటంతో సాదిక్ తన అకాడమీకి వెళ్లాడని నూర్జహాన్ తెలిపారు. నూకరాజు కుటుంబానికి చెందిన ఆస్తులు గానీ, బంగారం గానీ తమ వద్ద లేవని, తమ బ్యాంకు పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డులను పోలీసులకు అప్పగించామని ఆమె స్పష్టం చేశారు.



## ఆంధ్రప్రదేశ్‌ను అన్యమత ప్రదేశ్‌గా మార్చారు

**సాదిక్ లాంటి దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి -లవ్‌జిహాద్‌కు బలవుతున్న మహిళలు, యువతులు**

**వారందరికి బిజెపి అండగా ఉండి పోరాడుతుంది -టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరిక**

**తిరుపతి,ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్‌ను అన్యమత ప్రదేశ్‌గా మార్చారని, సాదిక్ లాంటి దుర్మార్గులను కఠినంగా శిక్షించాల్సి ఉందని,..లవ్‌జిహాద్‌కు బలవుతున్న మహిళలు, యువతులకు బిజెపి అండగా ఉండి పోరాడుతుందని టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో.. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అన్యమత ప్రదేశ్‌గా మార్చారంటూ దుయ్యబట్టారు. హిందూ దేవాలయాలు, దేవతల పై దాడులు చేసి విగ్రహాల చేతులు నరికివేశారని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని ఎవరైనా నాశనం చేయాలని చూస్తే రాబోయే రోజుల్లో పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సనాతన ధర్మాన్ని కాపాడేందుకు బీజేపీ కంకణబద్ధమై ఉందన్నారు. విజయసాయిరెడ్డి ఆరోజు వైసీపీ ప్రభుత్వంలో ఉన్నప్పుడే సనాతన ధర్మంపై మాట్లాడి ఉంటే బాగుండేదని భానుప్రకాశ్



అభిప్రాయపడ్డారు. అన్యాయం జరిగినప్పుడే మాట్లాడాలని.. అప్పుడే ఆ నిజాయితీకి గుర్తింపు ఉంటుందన్నారు. బయటికి వచ్చిన తర్వాత మాట్లాడితే దానికి విలువ తగ్గుతుందని చెప్పుకొచ్చారు. కాకినాడలో సౌజన్య 'లవ్ జిహాద్' ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని తెలిపారు. హిందూ సమాజానికి తామున్నామని భరోసా ఇస్తున్నామని అన్నారు. దేశంలో కొన్ని వేల మంది యువతులు, మహిళలు 'లవ్ జిహాద్'కు బలైపోతున్నారని వ్యాఖ్యానించారు. సాదిక్ లాంటి దర్మార్గుల వెనుక కర్త, కర్మ, క్రియ ఎవరో గుర్తించి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సాదిక్ కుట్రపై లోతుగా విచారణ జరిపి, శిక్షించాలని ఏపీలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఉన్న సాదిక్ లాంటి వెధవవలు, దుర్మార్గులు, నీచులను గుర్తించాలని భాను ప్రకాశ్ కోరారు. బాధితులు ఏక్షణంలోనైనా సహాయం కోసం సంప్రదించేలా ప్రభుత్వమే 'టోల్ ఫ్రీ' నంబర్ ఏర్పాటు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి సమాచారం ఇవ్వాలని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేవరకు వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పోలీసుల రక్షణ కూడా బాధితులకు ఏర్పాటు చేస్తామన్నారు. దీనిపై ఏపీ డీజీపీ ప్రత్యేకంగా దృష్టి సారించాలని భాను ప్రకాశ్ రెడ్డి కోరారు.

# యువత భవిష్యత్తుకు భూక్య జంపన్న భరోసా.

## శంకరాజుపల్లిలో ఉచిత కంప్యూటర్ శిక్షణకు శ్రీకారం




**స్టేట్ ఇంచార్జ్ ఆగస్టు 26( రిపబ్లిక్ న్యూస్ )** గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న సూచన మేరకు ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లిలో యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు నెలలపాటు ఈ శిక్షణ కొనసాగనుంది.భూక్య జంపన్న చొరవతో గ్రామీణ యువతకు కంప్యూటర్ విద్యను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్థానిక యువత హర్షం వ్యక్తం చేస్తోంది. జాడి మౌనిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో కంప్యూటర్ ప్రాథమిక అంశాలు, టైపింగ్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ వినియోగం, ఆన్‌లైన్ దరఖాస్తుల విధానం, డిజిటల్ సేవలపై శిక్షణ ఇస్తున్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉద్యోగ సాధనకు ఎంతో కీలకమని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు సాంకేతిక విద్య అందక అవకాశాలు కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.యువత నైపుణ్యాలను పెంపొందించేందుకు భూక్య జంపన్న చేస్తున్న కృషి అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని యువత తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.


## తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీ ఓ ఎస్ ఎస్ ) పోస్టర్ ఆవిష్కరణ



**మెదక్ఆగస్టు 26( రిపబ్లిక్ న్యూస్)**
తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీ ఓ ఎస్ ఎస్ ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ ఎస్ ఎస్ సీ మరియు ఇంటర్మీడియట్ ప్రవేశాలపై రూపొందించిన ప్రచార పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ బుధవారం విద్యాశాఖాధికారి . రాజు , అడల్ట్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీమోహన్, విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ రాజు, మెదక్ జిల్లా టీ ఓ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ఎ.వరప్రసాద్, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవకాశాన్ని చదువు మధ్యలో మానేసిన 14 సంవత్సరాలు పైబడిన విద్యార్థుల కు మరియు యువతి యువకులకు చక్కని అవకాశం కాబట్టి వినియోగించుకోవాలని అన్నారు.

## రేగుంట గ్రామంలో మల్లన్న స్వామి దేవాలయంలో చోరి.

**మల్లాపూర్ ఆగష్టు 26 (రిపబ్లిక్ న్యూస్)**




మల్లాపూర్ మండలం రేగుంట గ్రామంలోని మల్లన్న దేవాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు హుండీ తాళాలను మంగళవారం రాత్రి పగలగొట్టి అందులోని పెద్ద మొత్తంలో నగదు సొమ్ము, వెండి సామాగ్రిని అపహరించినట్లు ఆలయ నిర్వాహకులు బుధవారం ఉదయం గుర్తించారు. ఈ ఘటనపై గ్రామ సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ పోలీసులకు సమాచారం అందించగా, వారు వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు తదుపరి విచారణ ప్రారంభించారు.
త్వరలోనే నిందితులను పట్టుకుంటామని చెప్పడం జరిగింది.
సిసి కెమెరాలు భద్రతా లేని కారణంగా దొంగతనం చేసే వాళ్లకు సులువుగా అయిందిఇలాంటి దొంగతనాలు ప్రజా వ్యతిరేక చర్యలు ఇంకోసారి పునరావృతం కాకుండా దేవాలయ పరిరక్షణ కొరకై సీసీ కెమెరాలు పెట్టించడానికి గ్రామానికి చెందిన యాదవ సంఘం అధ్యక్షుడు బండారి వెంకటేష్( రిపబ్లిక్ పత్రిక రిపోర్టర్) కలసాని రాజన్న, తిప్పనవేని నాగరాజు, బైర రాజేందర్ ముందుకు వచ్చి సీసీ కెమెరా ఏర్పాట్లు త్వరలోనే చేస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు గాను గ్రామపంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్ మరియు పాలక వర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# పీఎం ఎఫ్ ఎం ఇ పథకం ద్వారా ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు అవకాశం

**మెదక్ జిల్లా పారిశ్రామిక శాఖ ఆధ్వర్యంలో అవగాహన & ప్రోత్సాహక కార్యక్రమం**

**జిల్లా పరిశ్రమల అధికారి మేనేజర్ శ్రీ యాదగిరి**



**మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 26 ( రిపబ్లిక్ న్యూస్ )**
మెదక్ జిల్లా పారిశ్రామిక శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పి ఎం ఎఫ్ ఎం ఇ ) ద్వారా జిల్లాలోని సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ వ్యాపారులకు, ఎస్ ఎచ్ జి లు, ఎఫ్ పి ఓ లు, రైతులు మరియు ఔత్సాహికులకు ఆర్థిక సహాయం, సాంకేతిక మార్గదర్శకత్వం మరియు వ్యాపారాభివృద్ధి అవకాశాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జి ఎండి ఐ సి మేనేజర్ యాదగిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఇప్పటికే ఉన్న ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల అభివృద్ధితో పాటు, అర్హత కలిగిన కొత్త యూనిట్ల ఏర్పాటుకు కూడా ప్రోత్సాహం లభిస్తుంది. పండ్లు- కూరగాయల ప్రాసెసింగ్, ధాన్యాలు–పప్పుదాన్యాలు, మసాలాలు, బేకరీ ఉత్పత్తులు, పాలు మరియు పాల ఉత్పత్తులు, నూనె గింజల ప్రాసెసింగ్, పికిల్స్, జామ్లు, పల్ప్, డీహైడ్రేటెడ్ ఉత్పత్తులు, రెడీ–టు–ఈట్ తదితర విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల యూనిట్లకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.
పి ఎం ఎఫ్ ఎం ఇ పథకం ముఖ్య ప్రయోజనాలు గురించి వివరిస్తూవ్యక్తిగత సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ యూనిట్లకు అర్హత మేరకు క్రెడిట్–లింక్డ్ క్యాపిటల్ సబ్సిడీ.
ఎస్ ఎచ్ జి లు, ఎఫ్ పి ఓ లు, సహకార సంఘాలు మరియు ఇతర సమూహ ఆధారిత సంస్థలకు తగిన మద్దతు.
ఆహార ఉత్పత్తుల విలువ జోడింపు, ప్యాకేజింగ్, బ్రాండింగ్ మరియు మార్కెటింగ్కు ప్రోత్సాహం.
బ్యాంకు రుణం, ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీర్ ), సాంకేతిక అంశాలు మరియు వ్యాపార ప్రణాళిక పై మార్గదర్శకత్వం.
స్థానిక వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి రైతులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడం.
గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి మరియు మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధికి అవకాశం.
ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీ డి ఎస్ అమర్సింగ్ గారు మాట్లాడుతూ, మెదక్ జిల్లాలో రైతులు, ఎస్ ఎచ్ జి లు, ఎఫ్ పి ఓ లు మరియు యువత తమ ప్రాంతంలో లభించే వ్యవసాయ ఉత్పత్తుల ఆధారంగా చిన్న తరహా ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.
ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు ప్రాజెక్ట్ ఎంపిక, డీపీ ఆర్ తయారీ, యంత్రాల ఎంపిక, విలువ జోడింపు, ప్యాకేజింగ్ మరియు. .మార్కెట్ అనుసంధానం వంటి అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు.
ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు

# ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భముగా జోగిపేట చర్చి ఆశ్రమంలో పండ్ల పంపిణీ చేసిన

## కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ ఆబేద్ చోటు ఖాన్





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 26 ( రిపబ్లిక్ న్యూస్ )** అందోల్ జోగిపేట్ చర్చిలో బీద వాళ్లకు పండ్లు పంపిణీ చేసిన కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఆబేద్ ఈ కార్యక్రమంలో జోగిపేట్ కోఆప్షన్ మెంబర్ జిసాన్ సోహెల్ ఉమర్ రసూల్ హుస్సేన్,తదితరులు పాల్గొన్నారు పర్వదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఆబేద్ ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అబేద్ మాట్లాడుతూ, ప్రవక్త మహమ్మద్ (స) ప్రపంచానికి అందించిన ప్రేమ, కరుణ, దయ, సహనం, సోదరభావం వంటి గొప్ప సందేశాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ప్రవక్త మహమ్మద్ (స) జీవితం యావత్ మానవాళికి మార్గదర్శకమని మహమ్మద్ ఆబేద్ పేర్కొన్నారు. ప్రజలంతా ఒకరి మత విశ్వాసాలు, ఆచార సంప్రదాయాలను మరొకరు గౌరవించుకుంటూ, పరస్పరం సహకరించుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ముఖ్యంగా యువత మంచి ఆలోచనలతో ముందుకు సాగుతూ, సమాజంలో శాంతి, మతసామరస్యం, సోదరభావం, మానవత్వం పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఇంటా ఆనందం, శాంతి, సుఖసంతోషాలు నింపాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ ఆబిద్ ఆకాంక్షించారు.

# డాకూరి శివశంకర్ రాజకీయ ప్రస్థానం

## ప్రజాసేవ-పార్టీ అనుబంధం-యువ నాయకత్వంతో ప్రత్యేక గుర్తింపు

## జోగిపేట పట్టణం నుంచి జిల్లా స్థాయి నాయకత్వం వరకు కొనసాగుతున్న రాజకీయ ప్రస్థానం

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 26 ( రిపబ్లిక్ న్యూస్ )**
జోగిపేట పట్టణానికి చెందిన శ్రీ డాకూరి శివశంకర్ గారు అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగిన యువ నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రజా సమస్యలపై స్పందించడం, పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం, యువతను సమన్వయం చేయడం, కార్యకర్తలకు అందుబాటులో ఉండటం వంటి అంశాలు ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రధానంగా కనిపిస్తాయి.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జోగిపేటలో 1 వ వార్డు కౌన్సిలర్‌గా( అందోలు - జోగిపేట మున్సిపాలిటీ) సేవలందించిన శివశంకర్ గారు, ప్రజా సమస్యలను స్థానిక సంస్థల వేదికగా ప్రస్తావిస్తూ ప్రజల తరపున తన బలమైన వాణిని వినిపించారు. విషయ పరిజ్ఞానం, వాగ్ధాటి, సమయస్ఫూర్తి, ప్రజలతో సన్నిహిత సంబంధాల కారణంగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

**పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర**
కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అన్నితానై నిర్వహించిన యువ గర్జన సభను విజయవంతం చేయడంతో పాటు, గౌరవనీయులు కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు, దేశ భవిష్యత్ ,అభివృద్ధికి దిశానిర్దేశం చేసే ఏకైక వ్యక్తి శ్రీ రాహుల్ గాంధీ గారు చేపట్టిన భారత్ జోడో యాత్ర సందర్భంగా పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడంలో శివశంకర్ గారు చురుకైన పాత్ర పోషించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.
పార్టీకి అనుకూల పరిస్థితులు ఉన్నప్పుడు మాత్రమే కాకుండా, రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదురైన సమయంలోనూ కార్యకర్తలతో కలిసి కొనసాగడం ఆయన రాజకీయ ప్రస్థానంలోని ముఖ్యమైన అంశంగా అనుచరులు పేర్కొంటున్నారు.
అదేవిధంగా, జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీ సురేష్ షెట్కర్ గారి విజయానికి సంబంధించి వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ తన వంతు కృషి చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**తరతరాలుగా కాంగ్రెస్‌తో అనుబంధం**
శ్రీ డాకూరి శివశంకర్ గారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో దీర్ఘకాలిక రాజకీయ అనుబంధం ఉంది. ఆయన తాతయ్య కీర్తిశేషులు గాలయ్య గారు ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా సేవలందించడంతో పాటు, జోగిపేట పట్టణ సర్పంచ్‌గా రెండు దశాబ్దాలకు పైగా ప్రజలకు





సేవలందించారు.ఆయన తండ్రి కీర్తిశేషులు డాకూరి జోగినాథ్ గారు కూడా జోగిపేట సర్పంచ్‌గా మూడు పర్యాయాలు సేవలందించారు. కుటుంబంలోని ఇతర సభ్యులు సైతం కాంగ్రెస్ పార్టీ వివిధ స్థాయిల్లో తనకు అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఇప్పటికీ పార్టీ నియమాలకు, గౌరవనీయులు, ఆరోగ్యశాఖమాత్యులు శ్రీ దామోదర్ సార్ గారి ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడం వీరి కుటుంబానికి ఒక ప్రత్యేక గుర్తింపు.ఈ కుటుంబ రాజకీయ ప్రస్థానంలో పదవుల కంటే పార్టీ బాధ్యతలకు ప్రాధాన్యత ఇచ్చే సంప్రదాయం కొనసాగిందని వారి కుటుంబానికి సన్నిహితులు పేర్కొంటున్నారు.
"పదవి అనేది బాధ్యతకు గుర్తింపు, సేవ అనేది నాయకత్వానికి అసలైన కొలమానం" అనే భావనతో కుటుంబం రాజకీయాల్లో కొనసాగిందని వారు తెలిపారు.

**కార్యకర్తలతో సన్నిహిత సంబంధం**
శివశంకర్ గారి రాజకీయ శైలిలో ప్రధానంగా ప్రస్తావించదగిన అంశం కార్యకర్తలతో ఆయనకు ఉన్న సన్నిహిత సంబంధం. ఎలాంటి ఆర్భాటాలకు తావులేకుండా అందరితో కలిసిమెలిసి ఉండటం, సమస్యలను తెలుసుకుని స్పందించడం, అవసరమైన సమయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండటం ఆయన ప్రత్యేకతలుగా అనుచరులు పేర్కొంటున్నారు.
యువతతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ, వివిధ కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయడం ద్వారా జోగిపేట పట్టణంతో పాటు అందోల్ నియోజకవర్గంలో యువ నాయకుడిగా ఆయనకు గుర్తింపు లభించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

**బీసీ యువ నాయకత్వంపై చర్చ**
సంగారెడ్డి జిల్లా రాజకీయాల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నాయకత్వానికి ప్రాధాన్యత కల్పించాలనే అంశంపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి పార్టీ బాధ్యతల కోసం శివశంకర్ గారి పేరు కూడా వినిపిస్తోంది.
అందోల్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో ఆయనకు ఉన్న పరిచయాలు, యువతతో ఉన్న అనుబంధం, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వంటి అంశాలను ఆయన రాజకీయ బలాలుగా అనుచరులు భావిస్తున్నారు.

**అందోల్ నియోజకవర్గానికి రాజకీయ ప్రాతినిధ్యంపై కార్యకర్తల అభిప్రాయం**
అందోల్ నియోజకవర్గానికి గత కొన్ని దశాబ్దాలుగా నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం లభించలేదనే అభిప్రాయం కాంగ్రెస్ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా తమ నియోజకవర్గానికి తగిన స్థాయిలో నామినేటెడ్ పదవులు లభించలేదని వారు పేర్కొంటున్నారు.
ఈ నేపథ్యంలో దీర్ఘకాలంగా పార్టీతో అనుబంధం ఉన్న కుటుంబాలకు, కష్టకాలంలో పార్టీతో కలిసి పనిచేసిన కార్యకర్తలకు రాజకీయ గుర్తింపు లభించాలనే ఆకాంక్ష కార్యకర్తల్లో ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

**యువత, కార్యకర్తలు, సంస్థాగత బలోపేతంపై దృష్టి**
ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీకి కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే పనిచేసే నాయకత్వం కాకుండా, నిరంతరం కార్యకర్తలతో అనుసంధానమై ఉండే సంస్థాగత నాయకత్వం అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.
ఈ నేపథ్యంలో శివశంకర్ గారి రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తేస్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా అనుభవం, యువతతో అనుబంధం, పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర, కుటుంబ రాజకీయ నేపథ్యం, కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు వంటి అనేక అంశాలు ఆయన రాజకీయ ప్రొఫైల్‌లో కనిపిస్తాయి.
"నాయకత్వం అంటే ముందుండటం మాత్రమే కాదు; తనతో నడిచే వారిని కూడా ముందుకు తీసుకెళ్లడం." అనే భావనకు అనుగుణంగా కార్యకర్తలతో కలిసి పనిచేయడం తన రాజకీయ ప్రయాణంలో కొనసాగిస్తున్నట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

**జిల్లా స్థాయి బాధ్యతపై ఆసక్తి**
సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి సంబంధించి వివిధ నాయకుల పేర్లు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్న నేపథ్యంలో, శ్రీ డాకూరి శివశంకర్ గారి పేరు కూడా ప్రాధాన్యతతో వినిపిస్తోంది.
పార్టీతో సుదీర్ఘ అనుబంధం, కుటుంబ రాజకీయ వారసత్వం, కౌన్సిలర్‌గా ప్రజాప్రతినిధి అనుభవం, యువతతో సంబంధాలు, కార్యకర్తలతో అనుబంధం వంటి అంశాల ఆధారంగా ఆయనకు జిల్లా స్థాయి బాధ్యత అప్పగించాలనే అభిప్రాయాన్ని అనుచరులు వ్యక్తం చేస్తున్నారు.
మరోవైపు, జిల్లా స్థాయి పదవికి తుది ఎంపిక పార్టీ అధిష్ఠానం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. పార్టీ భవిష్యత్ సంస్థాగత అవసరాలు, సామాజిక సమీకరణాలు, నాయకత్వ సామర్థ్యం, జిల్లాలోని అన్ని నియోజకవర్గాలతో సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.
జోగిపేట పట్టణం నుంచి ప్రారంభమైన డాకూరి శివశంకర్ గారి రాజకీయ ప్రయాణం కౌన్సిలర్‌గా ప్రజాసేవ, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన భాగస్వామ్యం, యువతతో అనుబంధం, కార్యకర్తలతో సన్నిహిత సంబంధాలు, తరతరాల రాజకీయ వారసత్వం వంటి అనేక అంశాలతో కొనసాగుతోంది.
ప్రస్తుత జిల్లా స్థాయి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన పేరు చర్చకు రావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో ముఖ్యమైన దశగా చెప్పవచ్చు. పార్టీ కోసం చేసిన సేవకు గుర్తింపు లభిస్తే అది ఒక్క నాయకుడికి మాత్రమే కాకుండాకష్టకాలంలో పార్టీతో నిలిచిన ప్రతి కార్యకర్తకు ప్రోత్సాహంగా మారుతుంది అనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది.
సేవే నాయకత్వానికి పునాది – కార్యకర్తలే పార్టీకి బలం
నిరంతర ప్రజా అనుబంధమే నాయకుడి అసలైన గుర్తింపు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా జవాబుదారీతనాన్ని పాటించాలి

హియరింగ్ కేసుల పరిష్కారంపై వేగం పెంచాలి : ఎన్నికల పరిశీలకురాలు ప్రశాంతి ఐఏఎస్

జిల్లాలో సమర్థవంతంగా సర్ ప్రక్రియ జరుగుతుంది

క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి,

: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా







**నంద్యాల బ్యూరో, ఆగస్టు 26 (రిపబ్లిక్ న్యూస్).**
ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ( సర్ -2026) ప్రక్రియలో ప్రతి దశలోనూ పారదర్శకత, జవాబుదారీతనాన్ని పాటిస్తూ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్యూరిఫికేషన్ మరియు ఇతర ఎన్నికల విధులను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎన్నికల పరిశీలకురాలు ఐఏఎస్ ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టరేట్లోనే వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, డి ఆర్ ఓ రాము నాయక్, వీఆర్వోలు, ఏ ఈ ఆర్ ల తో సమగ్ర ఓటర్ల జాబితా సవరణ పై ఎన్నికల పరిశీలకురాలు ప్రశాంతి ఐఏ ఎస్ సమీక్షించారు.ఎన్నికల విధుల పరిశీలనలో భాగంగా బీఎల్ఓల పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, ఫారమ్‌ల పరిష్కారం, నోటీసుల విచారణ తదితర అంశాలపై ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల పరిశీలకురాలు లిమాట్లాడుతూ.. క్షేత్రస్థాయి పరిశీలనలో బీఎల్ఓలు తమ విధులపై స్పష్టమైన అవగాహనతో, అవసరమైన ఆధారాలు మరియు పత్రాలను సక్రమంగా సేకరిస్తూ సమర్థవంతంగా పనిచేశారని తెలిపారు. లిరాజకీయ పార్టీలు లేవనెత్తుతున్న ప్రశ్నలు, సందేహాలను నివృత్తి చేయడంలో బీఎల్ఓలు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

జిల్లా కలెక్టర్ రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్‌గా పనిచేసిన అనుభవాన్ని వినియోగిస్తూ సిబ్బందికి నాణ్యమైన శిక్షణ అందిస్తున్నారని తెలిపారు. లిప్రణాళిక, శిక్షణ అంశాలను కలెక్టర్ మార్గదర్శకత్వంలో సమర్థవంతంగా నిర్వహిస్తూ, క్షేత్రస్థాయిలో వాటిని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. మరణించిన వారి పేర్లను ఏఎస్‌డీ జాబితా నుంచి తొలగించే సమయంలో రాజకీయ పార్టీలతో స్పష్టమైన కమ్యూనికేషన్ కొనసాగించాలని తెలిపారు. లిడెత్ సర్టిఫికెట్, కుటుంబ సభ్యుల డిక్లరేషన్, అవసరమైన సందర్భాల్లో వీఆర్వో సమక్షంలో పంచనామా వంటి ఆధారాలను పరిశీలించిన అనంతరమే తొలగింపు ప్రక్రియ చేపట్టాన్నారు. గతంతో పోలిస్తే ఫారమ్-7 ద్వారా పేర్ల తొలగింపునకు వచ్చే అభ్యర్థనలు తగ్గడం బీఎల్ఓలు ఏఎస్‌డీ జాబితా ఆధారంగా మరణించిన ఓటర్లను ముందుగానే గుర్తించి, ఓటర్ల జాబితాను సమర్థవంతంగా ప్యూరిఫికేషన్ చేస్తున్నారనడానికి నిదర్శనమని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే వారపు సమావేశాలను కేవలం తహసీల్దార్ల స్థాయిలో కాకుండా ఈఆర్ఓలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు. నో-మ్యాపింగ్, లాజికల్ ఎర్రర్స్‌కు సంబంధించిన కేసులను ప్రత్యేకంగా షెడ్యూల్ చేసి, నిర్ణీత 24 నుంచి 48 గంటల వ్యవధిలో కలెక్టర్ లాగిన్‌కు పంపాలని అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా జారీ చేసిన నోటీసులకు సంబంధించి హియరింగ్స్ ను త్వరితగతిన పూర్తి చేసి, పెండింగ్ లో ఉన్న క్లెయిమ్స్‌ను నిబంధనల ప్రకారం పరిశీలించి వేగంగా డిస్పోజల్ చేయాలని సూచించారు.లిఎన్నికల ప్రక్రియలో ప్రతి దశలోని పారదర్శకంగా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటర్ల జాబితా ప్యూరికేషన్, ఎన్నికల విధులను పగడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. నంద్యాల జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ భారత ఎన్నికల సంఘం సూచించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగంగా కొనసాగుతోందనీ ఎన్నికల పరిశీలకురాలకు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా, ఓటర్ల జాబితాను పారదర్శకంగా, నిష్పాక్షికంగా శుద్ధి చేసేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపడుతోందన్నారు.ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ 100 శాతం పూర్తయిందన్నారు. సర్ ప్రక్రియలో భాగంగా మ్యాపింగ్ కాని 6,066 మంది, లాజికల్ డిస్క్రెపెన్సీస్ ఉన్న 74,217 మంది కలిపి మొత్తం 80,283 మంది ఓటర్లకు 100 శాతం నోటీసులు జారీ చేసి పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 36,382 హియరింగ్స్ నిర్వహించి, సంబంధిత ఆధారాలను సేకరించామని అన్నారు. ప్రస్తుతం ప్రతి కేసుకు సంబంధించి బిఎల్ఓ నివేదికతో పాటు ఎన్నికల సంఘం సూచించిన 13 రకాల ప్రామాణిక పత్రాలలో ఏదో ఒకదానిని సేకరించి విచారణలను త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. లిపెండింగ్‌లో ఉన్న ఫారమ్-6 ఫారమ్-7లో ఫారమ్-8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా నిబంధనల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**ే క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ చివరి తేదీ ఆగస్టు 30**
**ే క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం చివరి తేదీ: సెప్టెంబర్ 28**
**తుది ఓటర్ల జాబితా ప్రచురణ: అక్టోబర్ 3**

ఈ ఆర్ ఓ లు, ఏ ఈ ఆర్ వో లు, దీూా బి ఎల్ ఓ లు సమన్వయంతో పనిచేస్తూ క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చూడడంతో పాటు, అనర్హులు అయిన మరియు డూప్లికేట్ నమోదులను నిబంధనల ప్రకారం గుర్తించి సరిచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయడమే లక్ష్యంగా జిల్లా ఎన్నికల యంత్రాంగం పనిచేస్తోందన్నారు.

# బస్టాండ్‌లో కత్తుల కలకలం...

**ఇద్దరిపై కత్తులు,రాళ్లతో దాడితొమ్మిది మందిపై కేసు..నలుగురు అరెస్ట్**


**మరో నలుగురు జువైనల్స్ పోలీసుల అదుపులో -ఇద్దరిపై హత్యాయత్నం..మొత్తం 8 మంది అదుపులో**



**నంద్యాల క్రైం, ఆగస్టు 26, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ సమీపంలో ఇద్దరు వ్యక్తులపై కత్తులు,రాళ్లతో దాడి చేసిన ఘటనలో నిందితులపై చర్యలు చేపట్టినట్లు నంద్యాల 1వ పట్టణ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. విలేకరుల సమావేశంలో సీఐ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 24న రాత్రి 10.55 గంటల సమయంలో బైటిపేటకు చెందిన గుర్రం పశుపతి (32సం"),అతని తమ్ముడు మనోహర్‌పై తొమ్మిది మంది దాడికి పాల్పడ్డారు.కత్తులతో బెదిరించడంతో పాటు రాళ్లతో దాడి చేయడంతో ఇద్దరూ గాయపడినట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. సంఘటనకు సంబంధించిన సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను సేకరించి నిందితులను గుర్తించినట్లు చెప్పారు. దర్యాప్తులో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో బైటిపేటలోని బ్రహ్మంగారి గుడి సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.నలుగురు నిందితులను అరెస్టు చేయగా,మరో నలుగురు జువైనల్స్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.నిందితులను విచారించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా దాడులకు పాల్పడితే,కఠిన చర్యలు తప్పవని సీఐ సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు.కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన తెలిపారు.

# మద్యం మత్తులో ... స్తంభం ఎక్కి వ్యక్తి హల్ చల్

**తీవ్ర భయాందోళనలో స్థానికులు**



**పెనుకొండ, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
పెనుకొండ పట్టణంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి స్తంభం ఎక్కి హల్ చల్ చేసాడు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా
దర్గా సర్కిల్‌లో బుధవారం మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కిన వ్యక్తి హల్‌చల్ చేయడంతో కలకలం రేపింది. విద్యుత్ సరఫరా ఉన్న సమయంలోనే అతడు స్తంభం ఎక్కడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయంతో అక్కడున్న వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరిస్థితిని గమనించారు.మద్యం మత్తులో ఉన్న వ్యక్తి విద్యుత్ స్తంభం పైకి ఎక్కడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. విద్యుత్ స్తంభంపై ఎక్కి తీగలకు దగ్గరగా వెళ్ళడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో ఆందోళన మరింత పెరిగింది. విషయం తెలుసుకున్న స్థానికులు అతడిని కిందకు దిగాలని సూచించినప్పటికీ కొంతసేపు అక్కడే హల్‌చల్ చేయడం జరిగింది. ఈ ఘటనతో దర్గా సర్కిల్ పరిసరాల్లోకి వచ్చిన ప్రజలు, వాహనదారులు అప్రమత్తమయ్యారు.విద్యుత్ సరఫరా ఉన్న సమయంలో స్తంభం ఎక్కడం అత్యంత ప్రమాదకరమని తెలిసినా మద్యం మత్తులో కొందరు విచక్షణ కోల్పోయి ఇలాంటి చర్యలకు పాల్పడటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనల్లో సంబంధిత వ్యక్తికే కాకుండా చుట్టుపక్కల ఉన్న ప్రజలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుందని వారు పేర్కొంటున్నారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మద్యం మత్తులో అసాంఘికంగా వ్యవహరించే వారిపై పోలీసులు, సంబంధిత అధికారులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నంద్యాలలో సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ ప్రారంభం






**నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్**

**నంద్యాల క్రైం, ఆగస్టు 26, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల పట్టణ కేంద్రంలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగింది. పోలీసు సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో నిమగ్నమై ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు సేవలందిస్తున్నారు. వారి కుటుంబాలకు అవసరమైన నిత్యావసరాలు, ఇతర వస్తువులు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ ప్రారంభించిన అనంతరం జిల్లా ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని పాత జిల్లాలన్నింటిలోనూ ఇప్పటికే ఈ సెంట్రల్ పోలీస్ క్యాంటీన్లు విజయవంతంగా సేవలు అందిస్తున్నాయి. నూతన జిల్లాల రూపకల్పన తర్వాత, కొత్త జిల్లాల్లోనూ ఈ క్యాంటీన్ సేవలను విస్తరించడంలో భాగంగా నంద్యాలలో దీనిని అందుబాటులోకి తెచ్చారు. పోలీస్ శాఖలోని సిబ్బంది నుండి ఉన్నతాధికారుల వరకు ఏ ర్యాంక్ వారైనా ఈ క్యాంటీన్ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. మార్కెట్ ధరల కంటే చాలా తక్కువకే, ప్రత్యేక రీటైల్ క్యాంటీన్ రేట్లకే నాణ్యమైన వస్తువులను సిబ్బంది కొనుగోలు చేయవచ్చు.ఏదైనా నిర్దిష్టమైన వస్తువు స్టాక్‌లో లేకపోతే, ముందస్తు రిక్వెస్ట్ ఆధారంగా ప్రత్యేకంగా తెప్పించే వెసులుబాటును కూడా కల్పించారు. ఈ క్యాంటీన్‌లో పోలీసు కుటుంబాలకు అవసరమైన వివిధ రకాల నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు, వ్యక్తిగత వినియోగ వస్తువులు ఫ్రిడ్జ్, ఏసీ, కూలర్లు, ఫ్యాన్లు, టీవీల వంటి పెద్ద ఎలక్ట్రానిక్స్ తదితరాలను వస్తువులను అందుబాటులో ఉంచడం జరిగింది. పోలీసు సిబ్బంది బయటకు వెళ్లి వస్తువులు కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా, వారి నివాస ప్రాంతానికి సమీపంలోనే అవసరమైన వస్తువులు లభించే విధంగా ఈ సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఆల్ ఇండియా సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ ప్రామాణిక రేట్ల ప్రకారమే ఇక్కడ కూడా అమ్మకాలు జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఖాదర్ భాషా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ చిన్నికృష్ణ, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాసరెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పోలీస్ వెల్ఫేర్ ఆర్ఐ విజయనరసింహ, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామి నాయక్, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పోలీస్ అధికారుల సిబ్బంది పాల్గొన్నారు.

# మీలాద్ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

**ఫ్రెండ్స్ సహారా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ -ప్రారంభించిన ఖాజీ సయ్యద్ హయ్యద్ బాషా ఖాద్రి**





**తాడిపత్రి సంక్షేమం, ఆగస్టు 26,(రిపబ్లిక్ న్యూస్):**
మీలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ సహారా సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం తాడిపత్రి పట్టణ పరిధిలోని హజరత్ సిద్ధిఖ్ భాషా దర్గా వద్ద మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి తాడిపత్రి పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ హయ్యద్ బాషా ఖాద్రి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఖాజీని శాలువాతో సత్కరించారు. రక్తదానం చేసిన వారికి ధ్రువపత్రాలను అందజేశారు. రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. కులమతాలకు అతీతంగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారి ప్రాణాలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. గర్భిణులు, తలసెమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫిలియా తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి తరచూ రక్తం అవసరమవుతుందని, రక్తదాన శిబిరాల ద్వారా రక్త నిల్వలు అందుబాటులో ఉండేలా చేయవచ్చన్నారు. అనంతరం రోడ్డుపై జీవనం సాగిస్తున్న అభాగ్యులు, వృద్ధులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో ఫ్రెండ్స్ సహారా సొసైటీ సభ్యులు కరీముల్లా, అలీ, షోహేబ్, అజీమ్, జిలాన్, జాఫర్, జావిద్, పిట్టి ఖాజా, అక్మల్‌తో పాటు మత పెద్దలు, కేజీఎన్ పవర్ టూల్స్ రఫీ, దాదా, దాదు రిహాన్, చాంద్ భాషా, జిలాన్, వలి, మహబూబ్ బాషా, అబ్దుల్, ఎన్ఏకే జిలాన్, మహమ్మద్ అలీ, బషీర్, జిల్లా వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com